RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 282 వెల - రూ 5:00
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 22, ఫిబ్రవరి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## ఫిబ్రవరిలోనే మండుటెండలు..

- తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు..!



హైదారబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): మార్చి నెల ఆరంభం కాకముందే.. ఎండలు దంచి కొడుతున్నాయి. ఫిబ్రవరి నెల పూర్తి కాకముందే దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో.. ఆయా రాష్ట్రాల ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలోని కొంకణ్, గోవా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో 35 నుంచి 39 డిగ్రీల మధ్య మిగతా... 2లో

## హైదరాబాద్ ఫార్మాసిటీకి
# కేంద్రం మొండిచేయి

- అభివృద్ధికి సహకరించని మోదీ ప్రభుత్వం
- ఫార్మాసిటీపై కోర్టులో ముగిసిన విచారణలు
- తీర్పు అనుకూలంగా వస్తుందన్న భావన
- మంత్రి కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఫార్మాసిటీకి కేంద్రం నుంచి ఎలాంటి సహాయం అందలేదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఫార్మా, లైఫ్ సెన్సెన్ రంగంలో ప్రపంచానికి అత్యంత కీలక ప్రాంతంగా ఆవిర్భవించిందని, పరిశ్రమ ప్రయోజనాలు, పారిశ్రామిక అభివృద్ధి కన్నా కేవలం రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. ఇక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ తమ రాజకీయ ప్రయోజనాల కోసం పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామన్న హామీలను ఇచ్చుకుంటూ వెళ్తుందని, ఎలాంటి అనుకూల పరిస్థితులు లేని ప్రాంతాల్లో డిఫెన్స్ కారిడార్లను, బల్క్ డ్రగ్ పార్కులను ఏర్పాటు మిగతా... 2లో

## కుక్కల దాడి ఘటనపై
# సర్కార్ సీరియస్

- పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం
- ఘటనపై స్పందించిన మంత్రులు కెటిఆర్, తలసాని
- విచారణకు ఆదేశించిన జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి



హైదారబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): వీధికుక్కల బెడద నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటునట్టు తెలంగాణ మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. అంబర్‌పేట్‌లో వీధికుక్కల దాడిలో బాలుడు చనిపోయిన ఘటనపై స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. బాలుడి కుటుంబానికి కేటీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం మిగతా... 2లో

# ఎమ్మెల్యేలే మాఫియా రాజులు

- వరంగల్ జిల్లాలో మాఫియా రాజ్యం
- పవన్‌పై దాడికి ఎమ్మెల్యే వినయ్ కారణం
- ఆస్పత్రిలో పవన్‌కు పరామర్శ
- సిపి రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన రేవంత్



వరంగల్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్,మైనింగ్, సాండ్, వైన్ మాఫియాలు తయారయ్యారని అన్నారు. కాంగ్రెస్ నేత తోట పవన్‌పై దాడిని రేవంత్ రెడ్డి ఖండించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట పవన్‌ను ఆయన పరామర్శించారు. దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు అరాచక శక్తులుగా మారారని రేవంత్ విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గూండాల పాలన సాగుతోందన్న ఆయన.. ఎమ్మెల్యే ఆదేశాల తోనే తనపై దాడి జరిగినట్టు పవన్ చెప్పాడన్నారు. స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పై కేసు నమోదు చేయాలన్నారు. అతని ముఠా సభ్యులను జైల్లో వేయాల్సిన పోలీసులు కూడా రాజకీయ ఒత్తిడి వల్ల, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులను కాపాడుతున్నారని రేవంత్ ఆరోపించారు. 'మీరు మీ ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించండి.. మీరు ఏ రాజకీయ పార్టీకి అనుబంధ విభాగం కాదు.. మీ జీతభత్యాలు ఏ రాజకీయ నాయకుడూ వాళ్ల ఇంట్లో నుంచి ఇవ్వడం లేదు.. మీ పని మీరు చేయండి' అంటూ రేవంత్ రెడ్డి పోలీసులకు సూచించారు. దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా చిత్రీకరించి, అందరికీ సర్క్యులేట్ చేసి మరీ బెదిరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చూస్తూ ఊరుకోవడం మంచిది కాదని చెప్పారు. ఈ ఘటనపై డీజీపీ స్పందించాలని, క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో తెలుసుకోవాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, సీఎం దిష్టిబొమ్మలు దహనం చేయడంటూ పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి నుంచి రేవంత్ రెడ్డి పాదయాత్రగా కమిషనరేట్ కు బయలుదేరారు.

కాంగ్రెస్ యూత్ నాయకుడు పవన్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని.. సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకుల దాడిని సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ నేతపై ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హత్యకు కుట్ర చేశారని రేవంత్ ఆరోపించారు. ఎర్రబెల్లి, శంకర్ నాయక్ ఇతర ఎమ్మెల్యేలు వార్నింగులతో రెచ్చగొట్టడం వల్లే విపక్ష పార్టీల యాత్రలు, సభలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. గంజాయి బానిసలను ముఠాలుగా చేసి.. బీఆర్ఎస్ నేతలు మిగతా... 2లో

## వినయ్ భాస్కర్ నిఖార్సయిన ఉద్యమకారుడు

- చిల్లర పనులు చేసే వాల్లం కాదు: కుడా చైర్మన్



వరంగల్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్ పై జరిగిన దాడిలో బీఆర్ఎస్‌కు గానీ, ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌కు గానీ ఎలాంటి సంబంధం లేదని వరంగల్ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ చెప్పారు. ఛత్రపతి శివాజీపై పవన్ పెట్టిన తప్పుడు పోస్టింగ్స్ వల్ల జరిగిన ఘర్షణను బీఆర్ఎస్‌పై రుద్దుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ద్రోహులు కారని, నికార్సయిన ఉద్యమకారులని, వినయ్ బాస్కర్ లాంటి వారిపై చిల్లర మాటలు మాట్లాడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఖబడ్దార్.... చిల్లర ఆరోపణలు మానుకోవాలంటూ ఆయన హెచ్చరించారు. పచ్చటి తెలంగాణను విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తే సహించేది లేదని సుందర్ రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు వాళ్ళల్లో వాళ్లే కొట్టుకొని తమపై నెపం మోపుతున్నారని ఆరోపించారు. గ్రూప్ వార్ లో తన్నుకొని బీఆర్ఎస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మిగతా... 2లో



## గ్యాంగ్‌స్టర్ టెర్రర్ ఫండింగ్ కేసులు

- 72 ప్రాంతాల్లో ఏకకాలంలో ఎన్ఐఎ సోదాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజామంటలు):గ్యాంగ్‌స్టర్ టెర్రర్ ఫండింగ్ కేసులకు సంబంధించి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ బృందందూకుడు పెంచింది. దేశ వ్యాప్తంగా మంగళవారం ఉదయం సుమారు 72 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ, చండీగఢ్, యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో ఎన్ఐఏ అధికారులు ముమ్మర సోదాలు సాగాయి. అక్రమ ఆయుధాల వ్యాపారులు, గ్యాంగ్‌స్టర్ల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. అనేక మంది ఇళ్లలో అక్రమంగా ఆయుధాలు ఉన్నాయన్న మాచారంతో ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఫిలిబిత్ కేంద్రంగా అక్రమంగా ఆయుధాలను గ్యాంగ్‌స్టర్లు, ఉగ్రవాదులకు సరఫరా చేస్తున్నారని ఎన్ఐఏ సోదాల్లో తేలింది. అక్రమ ఆయుధాలు పాకిస్థాన్ దేశం నుంచి వచ్చాయని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్ , నీరజ్ బవానా లకు చెందిన ముఠా సభ్యుల నుంచి అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఎన్ఐఏ అధికారులు.. వారిని ప్రశ్నిస్తున్నారు. మిగతా... 2లో

## ప్రజానాడి




## లైఫ్ సైన్సెస్ రంగం వృద్ధికి
# మరింత ఊతం

### లైఫ్ సైన్సెస్ రంగంలో 4 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి

- 24 నుంచి 26వ తేదీ వరకు బయో ఏషియా సదస్సు
- తొలిసారి సదస్సులో పాల్గొంటున్న ఆపిల్ కంపెనీ
- పలు వివరాలు వెల్లడించిన మంత్రి కెటిఆర్




హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రస్తుతం ఉన్న 4లక్షల ఉద్యోగాలను రెట్టింపు చేసి.. 8లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బయో ఏషియా సదస్సు నేపథ్యంలో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ బయో ఏషియా ప్రాముఖ్యతతోపాటు జీవశాస్త్ర, ఫార్మా రంగాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన, చేపట్టనున్న చర్యలను వివరించారు. బయో ఆసియా సదస్సు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శం ఉందన్నారు. తొలిసారి ఆపిల్ కంపెనీ కూడా పాల్గొంటుందని కేటీఆర్ ప్రకటించారు.ఇప్పటి వరకు 19 సదస్సులు జరిగాయని, ఈసారి ప్రతిష్టాత్మకంగా 20వ సదస్సు నిర్వహించుకోబో తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు సదస్సు కొనసాగుతుందని, 'అడ్వాన్సింగ్ ఫర్ వన్ : షషేపిగ్ నెక్ట్స్ జనరేషన్ హ్యూమనైజ్డ్ హెల్త్‌కేర్' అన్న ఇతివృత్తంతో 20వ బయో ఏషియా సదస్సు జరుగుతుందన్నారు. గత 19 సంవత్సరాల్లో 24వేలకోట్ల పెట్టుబడులను బయో ఏషియా రాష్ట్రానికి తీసుకువచ్చిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన పెట్టుబడులు కొన్ని ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయన్నారు. భారతదేశ లైఫ్ సైన్సెస్ రంగానికి బయో ఏషియా విస్తృతమైన సేవలను అందించిందన్నారు. దేశ లైఫ్ సైన్సెస్ రంగంలోని అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ సదస్సు విజయం సాధించిందని కేటీఆర్ అన్నారు. వందకుపైగా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, నోబెల్ అవార్డు గ్రహీతలకు ఆతిథ్యం ఇవ్వగలిగామని, 20వేలకుపైగా భాగస్వామ్య చర్చలు , 30 పాలసీ పేపర్లు, సిఫార్సులను ఈ సదస్సు అందించిందన్నారు. 100 దేశాలు ఇప్పటిదాకా ఈ సదస్సులో పాల్గొన్నాయని తెలిపారు. గత 20 సంవత్సరాలలో 250కి పైగా అవగాహన ఒప్పందాలను, ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవడంలో ఈ సదస్సు భాగస్వామిగా ఉందన్నారు. ఇప్పటికే అనేక దేశాలు భాగస్వామ్య కంట్రీల హోదాలో ఏషియాలో పాల్గొన్నాయన్నారు. ఈసారి కూడా పలు దేశాలు బయో ఏషియాతో భాగస్వామ్య దేశం హోదాలో పాల్గొంటున్నాయని తెలిపారు.

లైఫె సైన్సెన్ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మాసిటీ, మిగతా... 2లో

## బెలగావి సమస్య తీర్చలేని మోడీ

- యుద్ధాన్ని ఆపారంటే నమ్మాలా
- నడ్డా వ్యాఖ్యలపై కేటీఆర్ దెప్పిపొడుపు



హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): ప్రధాని నరేంద్ర మోదీపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. గొప్పల కోసం బీజేపీ నేతల చెప్పుకుంటున్న బడాయి మాటలను ఎండగట్టారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ప్రధాని మోదీ ఆపారని బీజేపీ మిగతా... 2లో



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు మద్దతు

- ఓవైసీ అభ్యర్థనతో కెసిఆర్ నిర్ణయం

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు): త్వరలో జరగనున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మిత్రపక్షమైన ఎంఐఎం పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు నివ్వాలని నిర్ణయించారు. గతంలో మాదిరి సీటు తమకే కేటాయించి తమకు మద్దతు ప్రకటించాలని మిత్రపక్షమైన ఎం ఐ.ఎం చేసిన అభ్యర్థించింది. ఈ మేరకు, పార్టీ సీనియర్లతో చర్చించిన సీఎం కేసీఆర్ ఎంఐఎం అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా ఏడాదికి ముందు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కాగా.. మిగతా... 2లో



## యాదాద్రి బ్రహ్మోత్సవాలకు
# శ్రీకారం

- స్వామి అనుమతితో ఉత్సవాల ప్రారంభం
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి21(ప్రజామంటలు): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దాదాపు ఐదేళ్ల తరవాత ఆలయ విస్తరణతో మిగతా... 2లో

## తెలంగాణను దోపిడీ చేసేందుకు
# మాయగాళ్లు వస్తున్నారు

- వారి మాటలు నమ్మితే నీళ్లు, కరెంటు, బొగ్గు దోపిడీ
- లబ్దిదారులకు చెక్కుల పంపిణీలో మంత్రి గంగుల



కరీంనగర్,ఫిబ్రవరి(ప్రజామంటలు): అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న తెలంగాణను మళ్లీ దోపిడీ చేసేందుకు మాయగాళ్ల వస్తున్నారని, వారి మాటలు నమ్మితే నీళ్లు, కరెంటు, బొగ్గును దోపిడీ చేసి రాష్ట్రాన్ని గుడ్డి దీపంగా మారుస్తారని మంత్రి గంగుల కమలాకర్ మిగతా... 2లో

## ఫిబ్రవరిలోనే
# మండుటెండలు..

(మొదటి పేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడంతో.. జనాలు ఆందోళనకు గురవుతున్నారు. భానుడి భగభగలకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. అయితే మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో వేడి గాలులు తీవ్రంగా వీచే అవకాశం ఉందని ఐఎండీ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్నప్పటికీ.. త్వరలోనే తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపింది. 4 నుంచి 9 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ప్రతి ఏడాది ఈ సమయానికి నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో పోల్చితే.. ప్రస్తుత ఉష్ణోగ్రతలు అధికమే అని ఐఎండీ తెలిపింది.

తాజా ఉష్ణోగ్రతలను అంచనా వేసి.. ఈ వేసవి మొత్తం ఎండలు అధికంగా ఉంటాయని చెప్పలేమని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. భూ వాతావరణ పరిస్థితుల కారణంగా అప్పుడప్పుడు ఇలా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వివరించారు. ఇక మైదాన ప్రాంతాల్లో 40 కంటే ఎక్కువ, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు వడగాలులు వీస్తున్నట్లు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# ఎంఐఎంకు మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ ఉపాధ్యాయ స్థానంతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానంలో ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ మార్చి 13న.. ఓట్ల లెక్కింపు మార్చి 16న జరగనుంది. త్వరలో జరగనున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, గతంలో మాదిరి సీటు తమకే కేటాయించి తమకు మద్దతు ప్రకటించాలని మిత్రపక్షమైన ఎం ఐ.ఎం చేసిన అభ్యర్థన మేరకు, పార్టీ సీనియర్లతో చర్చించిన మీదట, హైద్రాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మిత్రపక్షమైన ఎం.ఐ.ఎం పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతునివ్వాలని బీఆర్ఎస్ అధినేత., ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు.

అయితే ఈ ఎన్నికల్లో పోటీకి అధికార బీఆర్ఎస్ దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ రెండు స్థానాలుకు 2017లో ఎన్నికలు జరగ్గా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థి సయ్యద్ అమీనుల్ హసద్ జాఫ్రీకి, మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైద్రాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికిగానూ పీఆర్టీయూ- టీఎస్ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చింది. ఈసారి కూడా మజ్లిస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం.

## వినయ్ భాస్కర్ నిఖార్సయిన ఉద్యమకారుడు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ని కుట్రలు చేసినా వినయ్ బాస్కర్ వరంగల్ పశ్చిమలో ఐదోసారి గెలవడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. పవన్ పై దాడికి బీఆర్ఎస్కు- గానీ, ఎమ్మెల్యేకు గానీ ఎలాంటి సంబంధం లేదని మరోసారి ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

## లైఫ్ సైన్సెస్ రంగం వృద్ధికి
# మరింత ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మెడికల్ డివైసెస్ పార్క్, బయోఆసియాతో పాటు అనేక ఇతర ప్రయత్నాలు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో జీవశాస్త్ర రంగం విలువ, ఉద్యోగాలు కూడా 2028 నాటికి రెట్టింపు చేయాలన్న లక్ష్యమని, 2021లో హైదరాబాద్ దాని పరిసరాల్లోని జీవశాస్త్ర రంగ కంపెనీల ఏకో సిస్టమ్ విలువ 50 బిలియన్ డాలర్లు ఉండగా.. 2028 నాటికి దీన్ని వంద బిలియన్ డాలర్లకు చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అదే సమయంలో ప్రస్తుతం ఈ రంగంలో ఉన్న 4లక్షల ఉద్యోగాలను 8లక్షలకు పెంచుతామన్నారు. భవిష్యత్తులో కరోనా వంటి మహమ్మారులు ప్రబలితే ఆదుకోగల స్థాయిలో హైదరాబాద్ ఫార్మాసిటీ ఉండబోతుందన్నారు. జీవశాస్త్ర రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఫార్మాసిటీ ఏర్పాటుతో మరింత ఎత్తుకు ఎదుగుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## బెలగావి సమస్య తీర్చలేని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలపై వాస్తవాలను బయటపెట్టారు. బిజేపీ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర మధ్య నెలకొన్న బెలగావి సరిహద్దు సమస్యను ఇంతవరకు ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించలేకపోయాడని కేటీఆర్ తెలిపారు. కానీ రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని మాత్రం ఆపారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రధాని మోదీ ఆపారనేది అవాస్తవమని వాళ్ల నేతృత్వంలోని విదేశాంగ మంత్రిత్వ శాఖనే వెల్లడించిందని గుర్తు చేశారు. కర్ణాటకలోని ఉడిపిలో మోదీని ప్రశంసిస్తూ జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఏఎన్ఐలో ప్రచురితమైన ఓ కథనాన్ని ట్విట్టర్లో పోస్టు చేశారు. ఔర్ కిత్నా ఫేకోగె సర్ అంటూ సెటైర్ వేశారు.

## సుద్దాల అశోక్‌తేజకు పంపకవి పురస్కారం

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21:** మాతృభాషకు మాతృమూర్తులే ప్రధాన పరిరక్షకులు అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆంగ్లభాషా నైపుణ్యాలతోనే వృత్తి, ఉద్యోగ జీవితాల్లో రాణించగలమనే అపోహను వీడాలని హితవు పలికారు. ఆంగ్లమనేది ఓ భాష మాత్రమే అని, జ్ఞానం కాదని అభిప్రాయపడ్డారు. 2025 నాటికి హరియాణాలోని విశ్వవిద్యాలయాలన్నింటిలో అక్కడి మాతృభాషలోనే బోధన సాగేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో అక్షయాన్ సారథ్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు బండారు దత్తాత్రేయ పంపకవి పురస్కారాన్ని ప్రదానం చేసి స్వర్ణ కంకణాన్ని తొడిగి, శాలువాతో సత్కరించారు.

అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. సుద్దాల అశోక్‌తేజ సాహిత్య సేవను ప్రశంసించారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, తమ విశేష అధికారాలతో గిరిజన పంచాయితీలకు నేరుగా నిధులు అందేలా చొరవ తీసుకోవాలని అన్నారు.

సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ తెలుగు భాష పుష్పకవిమానం వంటిదని అన్నారు. ఈ సందర్భంగా అక్షరయాన్ కవయిత్రులు రాసిన 12 పుస్తకాలను వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ చెల్లప్ప, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డా.కె. సూర్యారావు, పద్మజారెడ్డి, మహిళా విజయం ఎడిటర్ వాసిరెడ్డి కాశీరత్నం, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఫార్మాసిటీకి
# కేంద్రం మొండిచేయి

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో కేంద్రం దేశ అభివృద్ధిని పణంగా పెడుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందుకున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను ఇవ్వకున్నా, హైదరాబాద్ ఫార్మాసిటీకి సహాయం చేయకున్నా, ఐటీఐఆర్ రద్దు చేసినా ఆయా రంగాల్లో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. సరైన నాయకత్వం చిత్తశుద్ధి ఉంటే ఎన్ని అడ్డంకు లనైనా దాటుకొని అభివృద్ధి సాధించడం సాధ్యమ వుతుందని తెలంగాణ నిరూపించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్మాసిటీ విషయంలో కోర్టుల్లో ఉన్న కేసులపై విచారణ ముగిసిందని, కోర్టు రిజర్వ్ చేసిన తీర్పు తమకు అనుకూలంగా ఉంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచంలోనే అతి కీలకమైన కేంద్రంగా మారిందని, ఏటా రూ.900కోట్ల టీకాలు తయారు చేస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. త్వరలోనే ఈ సంఖ్య రూ.1400 కోట్లకు చేరుతుందని, టీకాలన్నింటిలో తెలంగాణ వాటా 50 శాతానికి చేరుతుందని తెలిపిన కేటీఆర్ .. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదిత ఫార్మా కంపెనీలు అత్యధికంగా 214 ఉండడం, సుల్తాన్‌పూర్ లోని మెడికల్ డివైజెస్ పార్కు, త్వరలో ప్రారంభం కానున్న ఫార్మాసిటీ వంటివి హైదరాబాద్‌ను జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంల ఎంఆర్ఎన్ఏ టీకా కేంద్రం కూడా త్వరలో హైదరాబాద్‌లోనే ఏర్పాటు రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తూండటం కూడా జీవశాస్త్ర రంగానికి, ప్రజా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తుందన్నారు.



## ఎమ్మెల్యేలే మాఫియా రాజులు

(మొదటి పేజీ తరువాయి)

దాడులకు పాల్పడుతున్నారని కమిషనర్‌కు రేవంత్ రెడ్డి వివరించారు. పవన్ పై దాడి ఘటనపై చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డికి సీపీ రంగనాథ్ తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. ఇప్పటికే కొందరిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. ఇక దాడి జరిగిన సమయంలో సీసీ ఫుటేజ్‌లో ఉన్నవారి మొబైల్స్ సీజ్ చేసి విచారించాలని రేవంత్ రెడ్డి కోరారు. దాడులే ప్రాతి పదికగా రాజకీయం చేయాలనుకుంటే తాము రెడీగా ఉన్నామని రేవంత్ చెప్పారు. కేసీఆర్ ఫామ్ హౌస్ అయినా.. వరంగల్ హంటర్ రోడ్డు అయినా ఎక్కడికైనా తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ బీఆర్ఎస్ నాయకులకు సవాల్ చేశారు. రేవం వెంట స్తానిక కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## కుక్కల దాడి ఘటనపై సర్కార్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా చూస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులకు మంత్రి సంతాపం తెలిపారు. వీధికుక్కల దాడిలో బాలుడి మృతి చాలా బాధాకరమని అన్నారు. సిటీలో కుక్కల నియం త్రణ కోసం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతీ మున్సిపాలిటీలోనూ వీధి కుక్కల సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. దీని కోసం జంతు సంరక్షణ కేంద్రాలను, జంతు జనన నియంత్రణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుక్కల స్టెరిలైజేషన్ కోసం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ వివరించారు.

కాగా వీధి కుక్కలు దాడి చేయడంతో అంబర్‌పేటకు చెందిన నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. బాలుడి మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కాగా, కుక్కులు దాడి చేసిన దృశ్యాలు.. అక్కడున్న సీసీ కెమె రాల్లో రికార్డయ్యాయి. అంబర్‌పేట ఘటనపై మేయర్ గద్వాల విజయలక్ష్మి వెంటనే విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్‌లో వీధికుక్కల బెడదపై విమర్శలు వస్తుండటంతో ఈ ఘటనపై దిద్దు బాటు చర్యలు చేపట్టింది. ఘటనపై గద్వాల్ విజయ లక్ష్మి విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని వీధి కుక్కల బెడదకు నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే నగరంలోని కుక్కలకు స్టెరిలైజ్ చేసేందుకు ప్రతిరోజూ 30 వాహనాలు తిరుగుతున్నాయని, ఇప్పటికే 4 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే బాలుడి మృతి చెందిన ఘటనపై వెంటనే ఎంక్వయిరీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాలుడు ప్రదీప్(4) కుటుంబానికి సంతాపం తెలిపారు. నగరంలో వీధి కుక్కలు, కోతుల సమస్యను పరిష్కరిం చేందుకు ఈనెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## యాదాద్రి బ్రహ్మోత్సవాలకు
# శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఆలయంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రధాన ఆలయ ముఖమండపంలో ఆలయ ప్రధానార్చక బృందం వార్షికోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్వయంభు నారసింహుడి గర్భాలయానికి ప్రవేశించి స్వామివారి అనుమతితో ఉత్సవాలను ప్రారంభించారు. ముఖ మండపంలో తూర్పు అభిముఖంగా ఉత్సవ మూర్తులను చేసి ప్రధాన అర్చక బృందం విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల్లో అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో గీత, అర్చక బృందం, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మార్చి 3 వరకు 11 రోజుల పాటు జరగబోయే ఈ ఉత్సవాల కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలకంరణ, రంగురంగుల పూలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన ఎదుర్కోలు, 28వ తేదీన సాయంత్రం తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి సీఎం కేసీఆర్ దంపతులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.ప్రతి యేటా ఫాల్గుణ మాసంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఉత్సవాలను మొదటగా సృష్టికర్త ప్రారంభించడంతో బ్రహ్మోత్సవాలు అన్న పేరు స్థిరపడింది. ఈ ఉత్సవాలతో స్వామిక్షేత్రం 11 రోజుల పాటు ముక్కోటి దేవతలకు విడిదిగా మారుతుందని అర్చకులు చెబుతున్నారు. బ్రహ్మోత్సవ వేళ యాదగిరి వేదగిరి అన్న ప్రాచీన నామాన్ని సార్థకం చేసుకుంటుంది. ఈ సందర్భంగా సకల దేవతలను శాస్త్రోక్తంగా ఆహ్వానించి వేదోక్తంగా పూజలు నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా వస్తున్నది. విశ్వక్సేన పూజలతో మొదలైన ఉత్సవాలు స్వయంభువులకు నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహోత్సవాలకు ముగింపు పలుకుతారు. మొదట ధ్వజారోహణంలో గరుత్మంతుడికి పూజలు నిర్వహిస్తారు. మూడో రోజు నుంచి స్వామివారి అలంకార సంబురాలు జరుపుతారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది రోజుల్లో విశేష పర్వాలైన ఎదుర్కోలు, తిరుకల్యాణ మహోత్సవం, రథయాత్ర నిర్వహిస్తారు. పదో రోజున చక్రతీర్థ స్నానం జరుపుతారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.1,250 కోట్లు వెచ్చించి ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దగా గతేడాది మార్చి 28న ప్రధానాలయం పునఃప్రారంభమైంది. సకల వసతులతో నిర్మించిన ఆలయంలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. భక్తులకు, విఐపిలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని ఇవో జె. గీత తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వివిధ జిల్లాలు, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవాలకు వస్తుంటారు.

## తెలంగాణను దోపిడీ చేసేందుకు
# మాయగాళ్లు వస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్ నియోజక వర్గంలోని కొత్తపల్లి మండలం, కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ మండలాలకు చెందిన లబ్దిదారులకు మంగళవారం మంత్రి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాటి సమైక్య పాలనలో కరీంనగర్ వివక్షకు గురైందని, నిధులు రాక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. స్వయం పాలనలో వందలాది కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సమైక్య పాలనలో తాగునీరు కావాలంటూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కె పరిస్థితులు ఉండేవని, నేడు స్వయం పాలనలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన శుద్ధి జలాన్ని అందిస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుంటే విపక్షాల నాయకులు మాయ పాటలు చెప్పేందుకు వస్తున్నారని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డ షర్మిలమ్మకు తెలంగాణలో ఏం పని అని ప్రశ్నించారు. ఇక్కడ పాదయాత్రలు ఎందుకు చేస్తుందని నిలదీశారు. దొంగల మాటలు నమ్మొద్దని, కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉందామని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం కలిగించాలనే ధ్యేయంతో పేదలు, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ మానవతకు మారుపేరన్నారు. కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్లు, ఉచిత విద్య, కరెంటు రైతుబంధు రైతు బీమా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో



పనిచేసిన ప్రభుత్వాలు తెలంగాణ అభివృద్ధి కోసం పట్టించుకోలేదని, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా తెలంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి రూ.3.70కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపా రాణి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, కరీంనగర్ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు తదితరులు పాల్గొన్నారు.

## కీలక రంగాలకు కేటాయింపులేవి?

### విద్య, వైద్యం, పోలీసు శాఖలపై నిర్లక్ష్యం

### రాష్ట్ర బడ్జెట్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శ

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు తగ్గించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. తొమ్మిదేళ్ల పాలనలో కీలకమైన విద్య, వైద్యం, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధికి నిధులు కోతపెట్టి తెలంగాణలో సామాజిక అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యను నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, అధ్వానంగా ఉన్న ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు తాజా బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. 2022-23లో విద్యకు నిధుల కేటాయింపుల్లో జాతీయ సగటు 14.8% ఉంటే తెలంగాణ ఖర్చు 7.6% ఉందన్నారు. వైద్యారోగ్యంలో జాతీయ సగటు 6.3% ఉంటే, తెలంగాణ నిధుల కేటాయింపులు 5 శాతానికే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. అభివృద్ధి, ఆర్థిక వృద్ధిలో కీలమైన రహదారులు, వంతెనలకు బడ్జెట్‌లో 3.7 శాతమే నిధులు కేటాయించారని.. జాతీయ సగటు 4.5 శాతంగా ఉందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, తెలంగాణలో పోలీసు శాఖకు బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయన్నారు. పోలీసు శాఖకు జాతీయ సగటు 4.3 శాతం ఉంటే, తెలంగాణ 3.6 శాతం నిధులే కేటాయించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## పీఎం గతిశక్తి మాస్టర్ ప్లాన్‌లో
# హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు

### దక్షిణభాగం వైపు నిర్మాణానికి రూ. 2659 కోట్లు

### హైదరాబాద్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రహదారికి రూ.15వేల కోట్లు

### హైదరాబాద్-నాగ్‌పూర్ రహదారికి రూ.12,647 కోట్లు

### తెలుగు రాష్ట్రాలకు రూ.52వేల కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం పరంగా కీలక ముందడుగు పడింది. ఇప్పటికే గ్రేటర్‌కు ఉత్తర భాగంలో 158 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికిగానూ భూసేకరణకు సర్వే పూర్తవగా తాజాగా గ్రేటర్‌కు దక్షిణంవైపు రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గ్రేటర్ చుట్టూ 340 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఆర్ఆర్ఆర్‌లో భాగంగా దక్షిణ భాగం రోడ్డు నిర్మాణ పనులను వేగంగా చేపట్టడానికి 'పీఎం గతిశక్తి' మాస్టర్ ప్లాన్‌లో చేర్చింది. గతిశక్తి మాస్టర్‌ప్లాన్ కింద ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణం కోసం రూ.2659 కోట్లు కేటాయించింది. దేశవ్యాప్తంగా దాదాపు రూ. 4.53 లక్షల కోట్ల విలువైన 63 ప్రాజెక్టులను గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌లో చేర్చడానికి నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూపు (పీఎన్‌జీ) గుర్తించింది. అందులో తెలుగు రాష్ట్రాల్లోని రూ. 52,125.32 కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టులు, అంచనా వ్యయం ఖరారవ్వని మరొక ప్రాజెక్టు ఉన్నాయి. కేంద్రం గుర్తించిన వాటిలో రైల్వే, రహదారులు, మెట్రో, పెట్రోలియం పైప్‌లైన్, పారిశ్రామిక కారిడార్ల ప్రాజెక్టులు ఉన్నాయి.

రూ.255 కోట్ల వ్యయంతో చేపట్టనున్న విశాఖ పోర్ట్ లాజిస్టిక్స్ పార్కు, గుంటూరు-బీబీనగర్ రైల్వే లైను డబ్లింగ్ (రూ. 2853.23 కోట్లు), హైదరాబాద్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రహదారి (రూ.15 వేల కోట్లు), హైదరాబాద్-నాగ్‌పూర్ రహదారి (రూ. 12,647 కోట్లు), ముద్‌ఖెడ్-డోన్ వయా మహబూబ్‌నగర్ రైల్వే లైను డబ్లింగ్ (రూ. 4686.09 కోట్లు), నాగ్‌పూర్-విజయవాడ ఆర్థిక కారిడార్‌లో భాగంగా వరంగల్-ఖమ్మం సెక్షన్‌లో నాలుగులైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై ఊరుగొండ గ్రామం నుంచి వి.వెంకటాయపాలెం గ్రామం వరకు 108.24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ (రూ. 14,055 కోట్లు) ప్రాజెక్టులను పీఎన్‌జీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇంకా అంచనా వ్యయం ఖరారుకాని మల్కాపూర్ టెర్మినల్ నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఏటీఎఫ్ పైప్‌లైన్ ప్రాజెక్టునూ గతిశక్తిలో చేర్చారు. కాగా, మౌలిక సదుపాయాల కల్పనకు 2023-24 బడ్జెట్‌లో ప్రకటించిన రూ. 10 లక్షల కోట్లను ఈ ప్రాజెక్టులకు కూడా వినియోగించే



అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు ప్రాజెక్టులు గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌లో చేరడంతో కీలకమైన ప్రాజెక్టులు ఇక వేగంగా ముందుకుసాగే అవకాశం ఆ వర్గాలు చెబుతున్నాయి. అయితే అందుకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కూడా ముఖ్యమని, భూసేకరణ, ఇతర సదుపాయాలు కల్పించడంలో రాష్ట్రాలు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి. పీఎం గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌లో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నట్లు స్పష్టమవుతోంది. పీఎన్‌జీ గుర్తించిన 63 ప్రాజెక్టుల్లో అత్యధికంగా రవాణా, రహదారుల శాఖకు చెందిన ప్రాజెక్టులు ఉండడం గమనార్హం. ఈ 63 ప్రాజెక్టుల్లో రహదారుల శాఖకు చెందిన రూ. 299476.4 కోట్ల విలువైన 23 ప్రాజెక్టులు ఉండగా... రూ. 79015.7 కోట్ల విలువైన ఎనిమిది పట్టణాభివృద్ధి శాఖ ప్రాజెక్టులు, రూ. 47041.2 కోట్ల విలువైన 21 రైల్వే ప్రాజెక్టులు, రూ. 12780.6 కోట్ల విలువైన ఐదు వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రాజెక్టులు, రూ. 9056 కోట్ల విలువైన నాలుగు పెట్రోలియం, సహజవాయువుల ప్రాజెక్టులు, రూ. 5962.9 కోట్ల విలువైన నౌకాయన, జలమార్గాలు, పోర్టుల శాఖకు చెందిన రెండు ప్రాజెక్టులు ఉన్నాయి.

### రేపు భూపాలపల్లికి కేటీఆర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రానికి ఈనెల 23న మంత్రి కేటీఆర్ రానున్నారు. గణపురం మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని, గాంధీనగర్ కస్తూర్బా పాఠశాలను ప్రారంభిస్తారు. అనంతరం భూపాలపల్లికి చేరుకుంటారు. మంజూర్‌నగర్‌లో నిర్మించిన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌసతో పాటు సింగరేణి క్వార్టర్స్‌ను, పేదల కోసం నిర్మించిన 994 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా ప్రారంభించనున్నారు. వీటితో పాటు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో మంత్రి పాల్గొంటారు. కాగా, హోమ్ టెక్స్‌టైల్స్, ఫ్లోరింగ్, స్టీల్‌రంగంలో ప్రముఖ సంస్థ అయిన వెల్స్‌పన్ గ్రూప్.. అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం చందన్‌వెల్లిలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో నిర్మించిన ప్లాంట్‌ను బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.

# ఘనంగా మాతృభాషా దినోత్సవం

**నర్మెట్ట పిబ్రవరి 21 (ప్రజామంటలు):** అమృతతుల్యమైన మాతృభాష తెలుగును ఆస్వాదించి, నలుగురికి పంచి, సమా జాభివృద్ధికి తోడ్పడాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ టీ. శరత్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ



సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మన ఆత్మీయతను ప్రకటించుకోవడానికి ఏకైక మార్గం తెలుగు అని, అలాంటి భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే ప్రతి వ్యక్తి తమ ఇంటి నుండే తెలుగులో మాట్లాడడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో తెలుగు బోధించే ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సదానందం, ఎస్ఎంసి చైర్మన్ కందగట్ల ఉపేందర్, తెలుగు అధ్యాపకులు ఎస్. నాగమణి, కే. నర్సయ్య, ఏ రమేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ వంశీదర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**జనగామ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం కుందారం గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపాల్ దాస్ ఉపేందర్ ఆధ్వర్యంలో లింగాల ఘనపూర్ జడ్పీటీసీ బిఆర్ఎస్ రాష్ట్ర యువజన



నాయకులు గుడి వంశీదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు చిర్ర వీరస్వామి, గుగ్గిళ రాజు, రేసు ఉప్పలయ్య, పాలమాకుల యాకయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ పాలమాకుల నర్సయ్య, రాష్ట్ర ఉత్తమ రైతు గుగ్గిళ్ల నాగరాజు, యూత్ నాయకులు చింత వెంకటేష్, మెహరాజు, చెండేటి బాలకృష్ణ, బొమ్మేల భాస్కర్, పాలమాకుల యాదగిరి, సజ్జన కాశయ్య, మంద రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా లింగాల ఘనపురం జడ్పిటిసి గుడి వంశీదర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వడ్డిచెర్ల గ్రామ యూత్ అధ్యక్షులు గండి సుకేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణి. పాల్గొన్న సర్పంచ్ కడారి కృష్ణ, ఎంపిటిసి మంగమ్మ యాదగిరి, దూసరి వెంకన్న, గండి శ్రీనివాస్, గండి దశరథ, గుగ్గిళ్ళ నర్సయ్య, రేగు శ్రీనివాస్, రేగు శ్రీశైలం, దయ్యాల గణేష్, గండి శ్రీనివాస్, సతెల్లి నాగరాజు, ఏనామళ్ళ మహేష్, హుస్సేన్, జోగు పరుషరాములు, సతెళ్ళి సంతోష, ఉపాధ్యక్షులు గండి ఆంజనేయులు, గండి ఎల్లయ్య, జోగు మనోహర్.

# దేవాదాయ ధర్మాదాయ శాఖ హనుమకొండ జిల్లా

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని గుడిబండ పల్లె శివాలయం తనిఖీ చేసిన కమిషనర్ రామాల సునీత ఆదేశానుసారముగా హనుమకొండ డివిజనల్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి సారు మరియు ధూప దీప నివేదన సెలెక్ట్ కమిటీ సభ్యులు శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం



ముఖ్య అర్చక మొగిలిపాలెం రాంబాబు డిడిఎ నుఅప్లికేషన్ వెరిఫికేషన్ లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలము గుదిబండ పల్లె శివాలయము వెళ్లి నేరుగా ఆలయాన్ని పరిశీలించి పూజ కార్యక్రమాలు నిత్యము ధూప, దీప, నైవేద్యాలు జరుగుచున్నయా? లేదా అని చూసి ధూప దీప నివేదన అప్లికేషన్ ఎంక్వయిరీ చేయడం జరిగినది.

# ప్రజా గోస బిజెపి భరోసా

● **కేసిఆర్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలి**

**నర్మెట్ట పిబ్రవరి 21 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని ఆగపేట గ్రామంలో శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆగపేట గ్రామ శక్తి కేంద్ర ఇన్చార్జ్ సోక్కం అనిల్ కుమార్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్ హాజరయ్యాడు. అనంతరం మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్చి దుర్వినియోగం చేస్తుందని తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం పథకాలతోనే అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొన సాగుతుందని కేవలం ఒక కుటుంబం మాత్రమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బాగుపడిందని అది కల్వకుంట్ల కుటుంబం మాత్రమేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కల్వకుంట్ల కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీని రానున్న రోజుల్లో బొంద పెట్టడం ఖాయమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఓపెన్ కాస్టను బందు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ప్రజల బ్రతుకులో మట్టి కొట్టడాని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కేసిఆర్ నిరంకుశ వ్యతిరేక పాలనను మరియు వైఫల్యాలను రాష్ట్రంలోని గ్రామ గ్రామానికి తెలుపడం కోసమే ఈ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ యొక్క ఉద్యేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు బానోత్




రామకోటి, ఆగ పేట గ్రామ శాఖ అధ్యక్షులు రాజబోయిన జహంగీర్ మాలోత్ నాగేష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు కొర్ర సాయినాథ్, మండల సోషల్ మీడియా కన్వీనర్ ముఖేష్ రెడ్డి, మండల సోషల్ మీడియా కో కన్వీనర్ మోహన్ భాష, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు రాజబోయిన శ్రీనివాస్, బిజెపి నాయకులు, ధరావత్ రాజు, కిషోర్, సురేష్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలకు, పెన్షన్లకు 6 శాతం వడ్డీ చెల్లించండి

● **హైకోర్టు**

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** కోవిడ్ సమయంలో వాయిదా వేసిన జీతాలు,పెన్షన్ల మొత్తానికి 6శాతం వడ్డీ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసిందని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ఉద్యోగుల, పెన్షనర్స్ సమాచారం కోసం తెలిపారు.కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 50 శాతం కోత విధిస్తూ మార్చి 30 న ఇచ్చిన జీవో నెంబర్ .27 ను సవాలు చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యంతో పాటు పలు పిటిషన్లు ఉద్యోగుల, పెన్షనర్ల ప్రతినిధుల తరపున దాఖలయ్యాయి.వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎం. తుకారాం జీ లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.



పిటీషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ .. మూడు నెలల పాటు 50 శాతం వేతనాలు, పెన్షన్లు నిలిపి వేయడంతో వారు ఇబ్బందులు పడ్డారని, ఆ మూడు నెలల వేతనాన్ని కూడా ఒకేసారి చెల్లించలేదని ,వాటిని కూడా విడతల వారిగా చెల్లించారని వాదించారు. ఏ.పి.లో కూడా వేతనాలు వాయిదావేయడం తో 12 శాతం డిమాండ్ చేయగా 6 శాతం వడ్డీ చెల్లించాల0టూ ఏ.పి. వర్సెస్ డి. లక్ష్మీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించి ం దన్నారు. వాదనలు విన్న ధర్మాసనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తెలంగాణలో కూడా వాయిదా వేసిన జీతం, పెన్షన్ల మొత్తానికి 6 శాతం వడ్డీ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వంను హైకోర్టు ఆదేశించిందని ఉద్యోగుల, పెన్షనర్స్ సమాచారం కోసం హరి అశోక్ కుమార్ తెలిపారు.

# పెంబర్తిలో ప్రారంభమైన "చంద్రగిరి బంగారాం " చారిటబుల్ ట్రస్ట్

**జనగామ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పెంబర్తి కి చెందిన జనగామ జిల్లా ప్రముఖ వైద్యులు డా. చంద్రగిరి రాజమౌళి (రవళి నర్సింగ్ హోమ్) వరంగల్ నిట్ కళాశాల అలుమ్ని అధ్యక్షులు ఇంజనీర్ చంద్రగిరి శ్రీనివాస్, బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్ చంద్రగిరి ప్రసాద్ నేతృత్వంలో చంద్రగిరి బంగారాం చారిటబుల్ ట్రస్ట్ ఎర్పాటు చేసి మంగళవారం ప్రారంబించారు. ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా పెంబర్తిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు, 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా డీఈవో రాము హాజరై విద్యార్థులకు పరీక్షలలో ఎదుర్కొనే సమస్యలను విశధీకరించి మెలుకువలు తెలిపారు. నిట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ పులి రవికుమార్ పాల్గొని చారిటబుల్ ట్రస్టు ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. నిట్ కళాశాల ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్, ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆసనాల శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబాల ఆంజనేయులు, ఎంపీటీసీ మూల రవి మాట్లాడుతూ.... డా. రాజమౌళి, శ్రీనివాస్ సోదరులు పుట్టిన ఊరు పెంబర్తిలో వ్యక్తిగతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఇప్పుడు వారి తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి మరిన్ని



విస్తృతమైన సేవలు సమాజానికి అందజేయడానికి సంకల్పించడం వారి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అర్జున్ కుమార్, లయన్స్ క్లబ్ జనగామ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, జనగామ రచయితల సంఘం అధ్యక్షులు అయిలా సోమ నరసింహాచారి, విద్యా కమిటీ చైర్మన్ సంకటి రమేష్, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొని పెంబర్తిలో చంద్రగిరి బంగారాం చారిటబుల్ ట్రస్ట్ సంస్థ పట్ల హర్షం ప్రకటించారు.

# వాగ్దేవి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

**హుజురాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ మరియు తెలుగు అధ్యాపకులు మేకల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణం నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా నినాదాలతో వెళ్లి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారికి పూలమాలను అలంకరించి తిరిగి కళాశాల ప్రాంగణంలో సభా కార్యక్రమం ప్రారంభించారు. తెలుగు అధ్యాపకులు మేకల నవీన్ కుమార్ గురువర్యులు సీనియర్ తెలుగు అధ్యాపకులు రామకృష్ణ మరియు ముఖ్య అతిథి హుజురాబాద్ చైర్మన్ రాధిక శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.... మాతృభాష గొప్పతనాన్ని వివరిస్తూ పరభాషల కంటే మన భాష గొప్పదని తెలుగు గౌరవిస్తే అమ్మను గౌరవించినట్లే అని ప్రతి విద్యార్థి శ్రద్ధతో చదివి మంచి మార్పు రావాలని ఆశీస్సులు తెలియజేసింది. రామకృష్ణ మాట్లాడుతూ.... తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.... అన్ని సబ్జెక్టులతో పాటు మా కళాశాలలో తెలుగు ఒక ప్రత్యేకమైన భాషగా తెలుగు భాషను గౌరవిస్తూ తెలుగు అధ్యాపకులకు అన్ని విధాల సహకారాలు అందిస్తూ తెలుగు భాషను ముందుకు తీసుకెళుతున్నానని తెలుగు భాషను మా కళాశాలలో ఒక అమ్మలా మేము ఆరాధిస్తామని ప్రతి విద్యార్థి తప్పక తెలుగు భాషను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గందె రాధిక శ్రీనివాస్, రామకృష్ణ, కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి, కొలిపాక రమేష్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, వెంకటేష్ మరియు వివిధ అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ మహాసభ

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జిలుగుల గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ నిర్మాణ మహాసభ ఆరెపల్లి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్ సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరు రాములు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని హిందూ తత్వాన్ని ప్రచారం చేస్తుందని అలాంటి వారికి కమ్యూనిస్టు పార్టీగా మనం రాబోయే కాలంలో బుద్ధి చెప్పాలని వారన్నారు రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని డబుల్ బెడ్ రూమ్ కానీ దళితులకు ఇండ్ల స్థలాలు గాని మూడెకరాల భూమి గానీ ఇవ్వటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారన్నారు కమ్యూనిస్టు పార్టీ ద్వారానే ఉద్యమం చేసి మన హక్కులను సాధించుకోవాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు అనంతరం సిపిఐ నూతన గ్రామ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది శాఖ కార్యదర్శిగా వేముల కుమార్ స్వామి సహాయ కార్యదర్శిగా పబ్బు రవి ఆరేపల్లి మహేందర్ మరో 15 మందిని కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు ఆరేపల్లి చంద్రమౌళి గ్రామ నాయకులు దివ్య భారతి జానమ్మ మండ కనక రత్నం తదితరులు పాల్గొన్నారు.




# ఈనాడు ప్రతిభాపాటవ డివిజన్ లెవెల్ పోటీలు

**మెట్ పల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ప్రభుత్వ జూనియర్ కళాశాల మెట్ పల్లి లో జరిగిన ఈనాడు ప్రతిభా పాటవ డివిజన్ లెవెల్



పోటీలలో మెట్ పల్లి విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులు చిరంజీవి ఆర్. హరిణి – వ్యాసరచన లో ద్వితీయ స్థానం, యం. మణి తేజ – క్విజ్ లో ద్వితీయ స్థానం, యన్ మైత్రేయి – స్టోరీ టెల్లింగ్ లో తృతీయ స్థానం మరియు డ్రాయింగ్ లో ధనశ్రీ కన్సలేషన్ బహుమతులను మెట్ పల్లి డీస్పీ రవీందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. విద్యార్థులను విజ్ డమ్ హై స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ అభినందించారు.

# డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ పోటీలు

**విద్యార్థులు దేశం గర్వించ దగ్గ స్థాయికి రావాలి**

**మెట్ పల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మెట్ పల్లి అంబేద్కర్ స్టేడియంలో జగిత్యాల డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యం రెడ్డి పరివేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థినీ విద్యార్థులు 14 ,16 ,18, 20 ఏజ్ గ్రూపుల వారిగా రన్ను జంపు త్రోజ్ గేమ్స్ లను ముఖ్య అతిథిగా



విచ్చేసిన నియోజకవర్గ బిజెపి సీనియర్ యువ నాయకులు సురభి నవీన్ రావు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.... చదువులో ముందు ఉండాలి. అలాగే గేమ్స్ లో ముందుండాలని చదువు విజ్ఞానానికి ఉద్యోగానికి మంచి భవిష్యత్తు కోసం అలాగే గేమ్స్ అనేది కూడా దేశ ప్రతిష్ట కీర్తి తేవాలన్న క్రీడలతోనే అవుతుందని అలాగే ఇప్పుడు చూస్తున్నట్టు మహిళలు, పురుషుల వివిధ అథ్లెటిక్ గేమ్స్ లలో పాల్గొని భారతదేశానికి అథ్లెటిక్ గేమ్స్ దేశ క్రికెట్ గానీ వివిధ క్రీడల్లో దేశ విదేశాల్లో పాల్గొని దేశ కీర్తి ఎలా తెస్తున్నారో మీకు తెలుసని అలాగే మీరు కూడా దేశం గర్వించదగ్గ స్థాయికి రావాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి, వి. గంగాధర్, ఆల్ రౌండర్ గంగాధర్, అశోక్, కొమురయ్య, చక్రధర్, కార్తీక్ తదితర పి.టి. ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**మల్లాపూర్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మండలం లోనీ కొత్త దామరాజ్ పల్లి గ్రామానికి చెందిన సుంకే గణేష్ కువైట్ దేశంలో




ఇటీవల మృతిచెందగా మృతదేహం స్వగ్రమం చేరుకున్నదనీ తెలుసుకున్న సిఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మృతుని కుటుంబం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చి దహన సంస్కరణ నిమిత్తం తక్షణ సాయంగా 10, 000 రూ.లు ఆర్థికసాయం చేశారు.

## ఆటోలు,మోటర్ సైకిల్ దొంగల అరెస్ట్

### ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**మేడ్చల్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** సైకిల్ మోటర్లు,ఆటోల దొంగతనంతో పాటుసెల్ ఫోన్స్ స్నాచర్లను అరెస్టు చేశారు. మంగళవారం బాలనగర్ సిసిఎస్ , మేడ్చల్ పోలీసుల సహకారంతో ముగ్గురు నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు ఆటోలు, ఆరు సైకిల్ మోటర్లు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందిరమ్మ కాలనీ, జగదిరిగుట్టకు చెందిన షేక్ ఇక్బాల్, షిరిడి హిల్స్, జగద్గిరిగుట్ట చెందిన వడ్ల రవికుమార్, మన్సురాబాద్, ఎల్బినగర్ కు చెందిన బెల్లంకొండ శివనాగ నాగమల్లేశ్వరరావులను అరెస్టు చేశారు. వడ్ల రవికుమార్ గతంలో జగదిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసులో అరెస్ట్ అయ్యారు. వీరు మేడ్చల్ పోలీస్ స్టేషన్, కే బి హెచ్ బి ,జగదిరిగుట్ట, అల్వాల్, మిర్యాల్, బాలనగర్, బేగంపేట్, సంగారెడ్డి, చందానగర్, గుమ్మడిదల, కోదాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నేరస్తులను అరెస్టు చేయటంలో బాలనగర్ సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాలరాజ్, సిబ్బంది కృషి అభినందనీయం. నేరస్తులను మేడ్చల్ పోలీసు అరెస్టు చేసి కోర్టుకు పంపించారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీల చోరీ

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** అబిడ్స్ సెంటర్లో సిగ్నల్స్ పనిచేయక పోవడంలో విస్తుగొలిపే విషయాలు తెలిసాయి. నగరంలోని వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీలను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 5 లక్షలు విలువ చేసే 26 పెద్ద బ్యాటరీలు, 48 చిన్న బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో 11 కేసులు నమోదు అయినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు షేక్ అజీముద్దీన్, జంగల మద్దిలేటి లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు అబిడ్స్ సిఐ ప్రసాద్ తెలిపారు.

## సాగర్ నీటి విడుదల కోసం రైతుల ఆందోళన

**ఖమ్మం,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** జిల్లాలోని బోనకల్-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. సాగర్ నీళ్లను వెంటనే విడుదల చేయాలని జగ్గయ్యపేట రైతులు డిమాండ్ చేశారు. తమ పంటలు ఎండి పోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లిచ్చి న్యాయం చేయాలంటూ పురుగుల మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే ట్రాఫిక్ పోలీసులు స్పందించి.. ఎన్ఎస్పి కాలువ ద్వారా నీళ్లు విడుదల చేసేలా అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

## సిద్దిపేటలో మెయిన్ రింగ్ పైప్‌లైన్ నిర్మాణం

### రూ. 32 కోట్లతో 18 కిలోమీటర్ల మేర వాటర్ పైప్ లైన్

### శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట,ఫిబ్రవరి(ప్రజామంటలు):** హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే మెయిన్ రింగ్ పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. సుమారు రూ. 32 కోట్లతో 18 కిలోమీటర్ల మేర వాటర్ పైప్ లైన్ నిర్మాణం జరుగుతుందన్నారు.మంగళవారం



సిద్దిపేటలోని కాళ్ళకుంట కాలనీలో రింగ్ మెయిన్ పైప్ లైన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా నిరంతరాయంగా శు ద్ధి చేసిన తాగు నీరు అందించానున్నామన్నారు. రింగ్ మెయిన్ బాగా అభువృద్ధి చెందిన మహా నగరాలకు మాత్రమే అవకాశముండగా ముందు చూపుతో సిద్దిపేటకు రింగ్ మెయిన్ వేసుకుంటు న్నామన్నారు. ప్రస్తుతం 25 ఎంఎండీ లైన్లు వేస్తుండగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 2050 అవసరాలకు అనుగుణంగా 50 ఎం ఎల్ డీ పైప్ లైన్లు వేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వచ్చే రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. పైప్ లైన్ నిర్మాణం చేపట్టేటప్పుడు ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిద్దిపేట అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందని, విద్యాక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్మన్ కడవేరుగు మంజుల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మంచినీటి పథకాల్లో నిర్లక్ష్యం తగదు

**గద్వాల,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకాన్ని సకాలంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఎక్కడెక్కడ మిషన్ భగీరథ పనులు పూర్తయి ప్రజలకు మంచినీరు అందుతోందో అక్కడి సర్పంచుల ద్వారా ధృవీకరణ పత్రం తీసుకు రావాల్సిందిగా సంబంధితాధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద మురుగునీరు నిల్వకుండా, లైన్‌మెన్, వాటర్ గ్రిడ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు పేర్లు, వారి సెల్ నెంబర్లు రాయవల్సిందిగా సూచించారు. నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టేలా పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఇల్లా అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి విషయంలో రాజీలేదని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు.

## మంచినీటి సమస్యపై దృష్టి పెట్టాలి

**వికారాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** వేసవి తొంగి చూస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్‌లు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ అన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సర్పంచ్‌లకు సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేస్తానన్నారు.ఈ మేరకు తనవంతుగా సహాయం అందచేస్తానని అన్నారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్క రైతుకి పట్టా పాసుబుక్కుల సమస్య ఉందని, వాటిని వెంటనే పరిష్కరిస్తానన్నారు. గతంలోనే సీసీరోడ్లు మంజూరు అయ్యాయన్నారు. సరా పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేస్తామని అన్నారు.

## అటవీ శాఖలో సిబ్బంది కొరత

### అడవుల విస్తీర్ణానికి అడ్డంకి

**కరీంనగర్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** అటవీ విస్తీర్ణం పెంచడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపడుతోంది. అలాగే అడవుల రక్షణకు చర్యలు చేపట్టింది. వనాలను పెంచాలన్న లక్ష్యంతో ఇందుకు సంబంధించి అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు. మరోవైపు ఉన్న అడవులను రక్షించుకోవడం, సామాజిక వనాల పెంపకం, అన్నీ అటవీ శాఖ పరిధిలోనే ఉంటాయి. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతి తక్కువ అటవీ భాగం ఉన్న కరీంనగర్‌కు ఒక జిల్లా స్థాయి అధికారి, సిబ్బంది పూర్తి స్థాయిలో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. అలాగే ఉండాల్సిన దానిలో సగమే అటవీ విస్తీర్ణం ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు పూర్తి స్థాయి అధికారి, సిబ్బంది ఉండాలి.అప్పుడే ఇక్కడ వన విస్తీర్ణం పెంచడం, అక్కడ ఉన్న దానిని కాపాడుకోవడం.. హరితహారం లక్ష్యం సాధించడం సాధ్యమవుతుంది. నూతన ఠాణాలకు ఇతర ఠాణాల సిబ్బందిని పంపడంతో ఆయా ఠాణాల్లోనూ సిబ్బంది కొరత ప్రభావం పడుతోంది. నూతన నియామకాలు అయితేనే ఈ కొరత తీరే పరిస్థితి ఉంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ ఖాళీల భర్తీ సాధ్యమవుతుంది.

## ఉద్యోగ, ఉపాధి కల్పనలలో

# ముందున్న తెలంగాణ

### ప్రైవేట్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో ఎర్రబెల్లి

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం(టీపీయూఎస్) 2023 డైరీని మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో ఆవిష్కరించారు. ఈ





సందర్భంగా ఆయన మాట్లాడారు.అంతర్జాతీయ ఎంఎన్సీ కంపెనీల కేంద్రంగా కొనసాగుతున్న హైదరాబాద్ కు దేశం నలుమూలల నుంచి వచ్చే నిరుద్యోగులకు అతిపెద్ద ఉపాధి, ఉద్యోగ కల్పన నగరంగా మారిందన్నారు.ఉద్యోగార్థులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడమే కాకుండా వారికి అత్యధిక కనీస వేతనాలు అందిస్తూ, పీఎఫ్,ఈఎస్ఐ, ఆరోగ్య భద్రత వంటి అనేక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వేస్తున్న నోటిఫికేషన్లను ప్రైవేట్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగులుగా మారాలని సూచించారు.ఉద్యోగం రాని వారు ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ది పొందాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, సంఘం జాతీయ అధ్యక్షులు గంధం రాములు, కార్యదర్శి మోహన్ నాయక్, సభ్యులు వెల్పుకొండ వెంకటేశ్, విజయ్ రావు, స్వర్ణక్క తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్-2023 సంవత్సరం డైరీని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు లతో కలిసి ఆవిష్కరించారు.మంత్రి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు కష్టపడి పనిచేయడం వల్ల గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నాయన అన్నారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శులు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. మధుసూదన్ రెడ్డి , ఎంఎస్ఎస్ వాణి, మార విజయలక్ష్మి, పండరినాథ్, వెంకటరమణారెడ్డి, రమేశ్, సురేష్, మొగులయ్య, ప్రవీణ్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో తెలంగాణ రాష్ట్ర నిర్మాణ ఉద్యమం- కరపత్ర సాహిత్యం అనే అంశంపై ఆచార్య సూర్య ధనుంజయ్ పర్యవేక్షణలో వేల్పుకొండ వెంకటేష్ చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందించింది. ఈ సందర్భంగా వేల్పుకొండ వెంకటేశ్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు.

## అత్యంత సుందర నగరంగా

# కరీంనగర్ అభివృద్ధి

### 2వ అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దాలనే ధ్యేయం

### ఐలాండ్ల నిర్మాణ పనులకు మంత్రి గంగుల శంకుస్థాపన

**కరీంనగర్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** హైదరాబాద్ నగరం తర్వాత కరీంనగర్‌ను అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ





మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ వేలాదికోట్ల రూపాయలను విడుదల చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కరీంనగరాన్ని 2వ అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. నగరాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, గొప్ప నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ పట్టణం ఓల్డ్ పవర్ హౌస్ జంక్షన్ వద్ద రూ. 2.68 కోట్లతో చేపట్టనున్న ఐలాండ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ఆధునిక డిజైన్లతో 13 కొత్త ఐలాండ్ ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చి 31లోగా 13 అందుబాటులో ఉన్న స్థలంలోనే ఆధునిక డిజైన్లతో గ్రీనరీ,వాటర్, లైటింగ్ సిస్టంతో అందంగా తీర్చి దిద్దుతున్నామని వెల్లడించారు. నగరంలోని ప్రధాన అంతర్గత రోడ్లతో పాటు కూడళ్లను కూడా స్మార్ట్‌గా అభివృద్ధి చేయాలన్నది తమ ధ్యేయమని, కేబుల్ బ్రిడ్జి ప్రారంభం లోగానే కూడళ్ల పనులను పూర్తి చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఇంత గొప్ప ఐలాండ్ లు ఎక్కడ లేవని అన్నారు. ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కేబుల్ బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని, సదాశివ పల్లి వద్ద కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు బిటి పనులు ప్రారంభ మయ్యాయని తెలిపారు. నగర ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా భద్రతా వలయాన్ని పటిష్ట పరుస్తామని, ట్రాఫిక్ సిగ్నల్స్ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని అన్నారు.

# నాడు నీటి కోసం కంటతడి

### నేరు పుష్కలంగా నీటితో తడుస్తున్న మడి : మంత్రి హరీష్‌రావు వెల్లడి

**సిద్దిపేట,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంట లకు నీరందించటానికి రైతన్నలు కంటతడి పెట్టుకోగా స్వరాష్ట్రంలో నేడు పుష్కలంగా పంటలకు తడి నీరు అందుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యం వల్ల ప్రతి పొలం వాకిట్లోకి సాగు నీరు అందుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గ్రామ కాల్వలు, వాగులు మండుటెండలలో నిండి పారుతున్నాయని వివరించారు. దుబ్బాక నియోజకవర్గంలోని నర్లెంగడ్డ గ్రామంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.రోజుకు 30 కోట్లు వెచ్చించి నెలకు వెయ్యి కోట్లు ఖర్చుపెట్టి విద్యుత్తు కొనుగోలు చేసి రైతులకు నిరంతరం కరెంటు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో యాసంగిలో భూములు పడావుగా ఉంటే నేడు సీఎం కేసీఆర్ హయాంలో విత్తనం వేయక ముందే రైతుబంధు బ్యాంకు ఖాతాల్లో పడుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లిదయతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తెచ్చారని



తెలిపారు. నరేండ్లగడ్డ గ్రామంలో మహిళా భవనానికి రూ.10 లక్షలు, ముదిరాజ్ భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉగాది పండుగ తర్వాత ఇండ్లను మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు.

## భాషాపండితులకు

# న్యాయం చేయండి

### సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్,ఫిబ్రవరి(ప్రజామంటలు):** సీఎం కేసీఆర్‌కు బీజేపీ నేత బండి సంజయ్ లేఖ రాశారు. ప్రమోషన్లు అడిగితే సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. మాతృభాషా దినోత్సవం రోజు.. భాషా పండితులకు ఇచ్చే కానుక ఇదేనా అని లేఖలో ప్రశ్నించారు. 22 ఏళ్లుగా ప్రమోషన్లు ఇవ్వకపోవడం ఏంటి?.. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ప్రశ్నించారు. తక్షణమే భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పీఆర్సీని ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు జులై 1 నుంచి జీతాలు చెల్లించాలని లేఖలో బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## కీసరలో ముగిసిన

# బ్రహ్మోత్సవాలు

**మేడ్చల్,ఫిబ్రవరి(ప్రజామంటలు):** కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరిగాయి. మొదటి రోజు గణపతి పూజతో మొదలైన ఈ బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతితో పూజ ముగిశాయి. ఆలయ చైర్మన్ తాటకం రమేష్ శర్మ దంపతులు యాగ శాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు యాగశాలలో ఏర్పాటు చేసిన హోమ గుండానికి నిర్వహించిన పూర్ణాహుతి పూజలుతో బ్రహ్మోత్సవాలు ముగించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై

# చర్య తీసుకోవాలి

### మహిళా కమిషన్‌కు షర్మిల ఫిర్యాదు

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై రాష్ట్ర మహిళా కమిషన్‌కు వైఎస్ షర్మిల ఫిర్యాదు చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆమె ఆరోపించారు. మంత్రులు సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి, సత్యవతి రాథోడ్ పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైతే జాతీయ మహిళా కమి షన్‌ను కలుస్తానని షర్మిల చెప్పారు. మహిళలకు అన్యాయం జరుగు తున్నా బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారంలో ఉండి.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని షర్మిల అన్నారు. కేసీఆర్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై హత్యాచారాలు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయని షర్మిల పేర్కొన్నారు. రాష్ట్రంలో షీ టీమ్స్, సీసీ కెమెరాలు ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. మహిళల పట్ల అగౌరవంగా వ్యవహరి స్తున్నారని వైఎస్ షర్మిల ఆరోపించారు. పోడు భూముల కోసం పోరాడిన మహిళలను జుట్లు పట్టుకొని ఈడ్చుకెళ్లారని గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ పార్టీలో ఉన్న మహిళా నేతలు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. గవర్నర్ పై కూడా నీచంగా మాట్లాడుతు న్నారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నా.. మహిళా కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

## సాగునీటి కోసం రైతుల ఆందోళన

### రహదారిపై ధర్నాకు దిగిన అన్నదాతలు

**జగిత్యాల,ఫిబ్రవరి21(ప్రజామంటలు):** పంట పొలాలకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి రైతులు రహదారిపై ధర్నాకు దిగారు. రాజారాంపల్లి -బసంత్ నగర్ ఎక్స్ రోడ్ పై బైఠాయించి, నిరసన తెలిపారు. ఈ ధర్నాకు పలువురు బీజేపీ నాయకులు మద్దతు తెలపగా.. ముంజంపల్లి, మారేడుపల్లి ఉండేడా గ్రామాల్లో సుమారు 400 ఏకరాల భూములు సాగు నీరందక ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ నిర్మాణాలు చేపట్టి పంట పొలాలకు నీరు అంద కుండా ఎస్సారెస్పీ మెయిన్కాలువను కూల్చివేశారని ఆరోపించారు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ నుంచి పంప్ హౌస్ ద్వారా సాగు నీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఓ పక్క పంటలు ఎండుతుంటే పంప్ హౌస్ లు రన్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరం కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేస్తే పరిహారం డబ్బులు కూడా ఇవ్వలేదని, కనీసం తమ పంట పొలాలకు సాగునీరు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంప్ హౌస్ స్టార్ట్ చేసి ఎయిర్ వాల్స్ ద్వారా నీరు అందించాలని కోరారు. ఒకవేళ పంట పొలాలకు నీరు అందించ లేనట్లయితే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## డ్వాక్రా మహిళల

# ఉత్పత్తులకు మహర్దశ

### వస్తువులకు కామన్ బ్రాండ్ కోసం సెర్ప్ ప్రయత్నాలు

### అధికారులతో సమీక్షించిన మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్,ఫిబ్రవరి(ప్రజామంటలు):** రాష్ట్రంలోని డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మహర్దశ పట్టనుంది. డ్వాక్రా మహిళా సంఘాల ఉత్పాదక వస్తువులకు కామన్ బ్రాండ్ కోసం సెర్ప్ ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణ ముద్ర సార్వత్రిక గుర్తింపునకు సెర్ప్ ప్రాధాన్యం ఇస్తోంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్, లేబిలింగ్ కోసం ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఫ్లిప్ కార్ట్ సంస్థతో ఒప్పందం కాగా,అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో మరిన్ని ఒప్పందాలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి



దయాకర్ రావు అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ, సెర్ప్ సీఈవో సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ అధికారులతో హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే తెలంగాణ మహిళా సంఘాలు తయారు చేస్తున్న వస్తువులకు డిమాండ్ కు తగ్గట్లుగా, మరింత ఆకర్షణీయంగా లేబిలింగ్, ప్యాకింగ్ చేస్తూ, బ్రాండింగ్ ఏర్పాటు చేస్తే మన వస్తువులకు మరింత డిమాండ్ పెరిగి, కొనుగోలు శాతం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. దీంతో అమెజాన్ వంటి బడా అంతర్జాతీయ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, మరింతగా వ్యాపారం నిర్వహించుకోవచ్చని సూచించారు.ఇప్పటికే సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పేరు మారుమోగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ పేరు ప్రతిష్టలు ఉట్టి పడేలా, మహిళా ఉత్పత్తులను సులువుగా, ఆకర్షణీయంగా అంతర్జాతీయ మార్కెట్ లో అమ్ముడు పోయేలా ఈజీగా, క్యాచీగా ఉండేట్లుగా బ్రాండింగ్ ఉండాలని సూచించారు. త్వరలోనే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, వారి అనుమతితో కొత్త బ్రాండింగ్ చేయాలని, అందుకు తగ్గట్లుగా పలు పేర్లను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ హను మంతరావు, సెర్ప్ అధికారులు రజిత, తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రీశుడికి భారీ విరాళం

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి(ప్రజామంటలు):**యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జెడ్చర్లకి చెందిన సుందరమ్మ అనే మహిళ భారీ విరాళం ఇచ్చారు. సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఆలయ అధికారులకు అందించారు. స్వామికి పెద్ద మొత్తంలో విరాళం అందించడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు.. ఉదయం ఆలయ ప్రధానర్చకుల బృందం విశిష్ట పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. 11 రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. యాదాద్రికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి

# బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్

**ఆవిష్కరించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్**

**చిల్పూర్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ధర్మకర్తలు, ఆలయ ఇఓ మరియు ఆలయ



సిబ్బంది తదితరులు స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే డాక్టర్ . తాటికొండ రాజయ్య మరియు జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ %d% బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాగాల సంపత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి ఈ నెల 26 నుండి మార్చి 5 వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవములు - 2023 కు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఇరువురి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత-బాలరాజ్, జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు,పిఆర్ఓ పసునూరి మహేందర్ రెడ్డి, ఆలయ ఈఓ వెంకట్రావు, ధర్మకర్తలు: రవిందర్ రెడ్డి, వీరారెడ్డి, సంపత్ రాజ్ మరియు ఇతర నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు

## "ఆల్ ఇన్ వన్" పుస్తకాల పంపిణీ

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** త్వరలో ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపధ్యంలో సనత్ నగర్ లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 70 మంది పేద విద్యార్థులకు సులువుగా



చదువుకొనుటకు ఉపయోగపడే " అల్ ఇన్ వన్" పుస్తకాలను ఓ స్వచ్చందసంస్థ నిర్వాహకులు అందచేశారు. మంగళవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు పురూరవరెడ్డి స్టూడెంట్స్ కు పుస్తకాలను అందచేశారు. కార్యక్రమంలో స్వచ్చందసంస్థ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ

## మాతృభాషా దినోత్సవ వేడుకలు

**రాయికల్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణంలోని ప్రగతి హైస్కూల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలచే తెలుగు



పద్యాలు, కవితలు, తెలుగు భాష తీయదనం.. తెలుగుజాతి గొప్పదనం పాట పై నృత్యం, వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బాలె శేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్ని భాషలు నేర్చుకున్న మన మాతృభాషను మరిచిపోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ, డైరెక్టర్ బాలె నిఖిల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ అసోసియేషన్ ఎన్నికలు

**గొల్లపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల బిజిఎం చర్చ్ ఆవరణలో పాస్టర్ అసోసియేషన్ ఎన్నికలకు జిల్లా మరియు ధర్మపురి నియోజకవర్గ పాస్టర్లు



ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చందుపాల్ నతానియల్ మాట్లాడుతూ పాస్టర్లు ఐక్యమత్యంగా ఉండి వారికున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆధ్యాత్మికంగా ఎదగడానికి సేవకులు ఐక్యంగా ఉండడం ఎంతో అవసరమని తెలిపినారు గొల్లపల్లి మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ముత్తమల్ల సుధాకర్ పాస్టర్ గారిని ఎన్నుకోవడం జరిగింది ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ బర్నబాస్ గౌరవ అధ్యక్షునిగా గడుగు సత్యానందం గార్లను ఎన్నుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాస్టర్ కోడిపెల్లి ప్రకాష్ యోనా సైమన్ బెన్నీ జాన్ వెస్లీ దేవిడ్ రాజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ ద్వారా పోస్టల్ ఖాతా ఓపెన్

**జనగామ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఈనెల 20వ తారీకు నుంచి 24 వరకు తపాలా శాఖ పోస్టల్ మహామేళా నిర్వహిస్తున్నట్లు జనగామ జిల్లా పోస్టల్ అసిస్టెంట్ సూపర్ ఇంటెండెంట్ శ్రీమతి మూల రమాదేవి ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత చేరువకు తపాలా శాఖ అడుగులు వేస్తుందని. ఈ మహా మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇప్పటికే వివిధ రకాల స్కీములతో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న తపాలా శాఖ వారికి మరింత చేరువయ్యేందుకు నడుంబిగించింది. పోస్ట్ ఆఫీస్ కి రాకుండానే వారి ఇంటి వద్దనే ఆన్లైన్ ద్వారా పోస్టల్ ఖాతా తీసుకునే వెసులుబాటు కల్పించింది. పోస్ట్ ఆఫీస్ కి వెళ్లకుండానే మీ ఇంటి వద్దనే ఉండి పోస్టల్ ఖాతా ఓపెన్ చేసుకోవాలనుకునే వారు పోస్ట్ ఇన్ఫో, అనే అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని దాని ద్వారా వారి చిరునామా ఇతర వివరములు నమోదు చేసి సర్వీస్ రిక్వెస్ట్ రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు. సర్వీస్ రిక్వెస్ట్ వచ్చిన వెంటనే సంబంధిత పోస్ట్ మాన్ మీ ఇంటి వద్దకు ఎకౌంటు ఓపెన్ చేసేందుకు అవసరమైన అప్లికేషన్ ఫారమ్స్ తీసుకొని వచ్చి వాటిని పూరించడంలో మీకు సహకరించి, పూరించిన అకౌంట్ ఓపెనింగ్ అప్లికేషన్,డబ్బులు, మీ వద్ద నుండి సేకరించుకొని పోస్ట్ ఆఫీస్ లో అందచేస్తారని పేర్కొన్నారు. పోస్ట్ ఆఫీస్ లో ఎకౌంటు ఓపెన్ చేసిన తర్వాత సంబంధిత పోస్ట్ మెన్ మీ ఇంటి వద్దకు వచ్చి మీకు పాస్బుక్ కూడా అందజేస్తారని, ఈ సేవకు ఎలాంటి అదనపు రుసుము ఉండదని తెలిపారు. ఇప్పటికే పోస్ట్ ఆఫీస్ అకౌంట్ కలిగి ఉన్న ఖాతాదారులు,



ఇంటర్నెట్ బ్యాంకింగ్,మొబైల్ బ్యాంకింగ్, ద్వారా రికరింగ్ డిపాజిట్, సుకన్య అకౌంట్ మరియు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, డిపాజిట్ లు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కోరుట్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**కోరుట్ల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలో నూతనంగా కోరుట్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం కోరుట్ల పట్టణంలోని ఐలాపూర్ రోడ్ లో గల తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో ఏకగ్రీవంగా ఎన్ను కొన్నారు.. అధ్యక్షులుగా చిలివేరి లక్ష్మీరాజం ప్రధాన కార్యదర్శిగా అల్లె రాము, ఉపాధ్యక్షులుగా లింగ ఉదయ్ కుమార్, మీర్జా ముక్రం బేగ్, చిట్యాల సాయి కృష్ణ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా మిట్టపల్లి వెంకటరమణ, ఇందూరి నరేష్, బాణాల శ్రీధర్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా మిట్టపల్లి బుచ్చిరెడ్డి, జాకీర్ హుస్సేన్, మహమ్మద్ అలీ, ముజిబుర్ రెహమాన్ ఎన్నిక కాగా కోశాధికారిగా పెడిమల్ల రాజు గౌరవ సలహాదారులుగా నీలి అనీల్, ఉరుమడ్ల శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు. లీగల్ అడ్వైజర్ లుగా న్యాయవాదులు బోయిని సత్యనారా యణను, కార్యవర్గ సభ్యులుగా తోగిటి లక్ష్మణ్, విజయ్ పాటిల్, చిట్యాల గంగాధర్, పీసరి ధర్మేందర్, కాశిరెడ్డి వెంకటరెడ్డి, ఇంద్రల హరీష్, మచ్చ రాఘవేంద్ర, ఎన్నమనేని మదన్ మోహన్ రావు, కొండ్లెపు అర్జున్, మహమ్మద్ సుమేర్, మహ్మద్ రిహాన్, వనతడుపుల మహాతేజ, అల్లం రాజేష్, మహమ్మద్ ముజాహిద్, గిన్నెల శ్రీకాంత్, మహమ్మద్ సాదిక్ అలీ, చింతాజీ రాధాకృష్ణ, గంగుల శ్రీనివాస్, పాతర్ల నరేష్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్ష,



కార్యదర్శులులక్ష్మీ రాజం, రాము మాట్లాడుతూ. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని, ఈ సంఘం ఏ జర్నలిస్ట్ యూనియన్ కు, ఏ జర్నలిస్టు సంఘానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

## కొబ్బరి బొండాల మాటున

# గంజాయి స్మగ్లింగ్, ముఠా అరెస్ట్

**హన్మకొండ, ఫిబ్రవరి 21 ( ప్రజా మంటలు):** జిల్లాలో ఆత్మకూర్ గ్రామ శివారు ప్రాంతంలో ఈ రోజు నిర్వహించిన తనిఖీల్లో అనుమానస్పదంగా వస్తున్న నిందితులు వాహనాలను అదుపులోకి తీసుకోని తనిఖీ చేయగా బోలెరో వాహనంలో కొబ్బరి బొండాల మధ్యలో గంజాయి ప్యాకెట్లను గుర్తించి పోలీసులు నిందితులను, సొత్తు ను పోలీస్ స్టేషన్కు తరలించారు. గత కొంతకాలంగా కొబ్బరి బొండాల మాటున గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు సమాచారం మేరకు గ్రామ ఉప సర్పంచ్ సహా నలుగురు ముఠా సభ్యులను టాస్క్ ఫోర్స్ మరియు ఆత్మకూర్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్ట్ చేసారు. వీరి నుండి పోలీసులు 34లక్షల రూపాయల విలువగల 170 కిలోల గంజాయి ఒక కారు, గంజాయి రవాణాకు వినియోగించిన ఒక బోలెరో సరుకు రవాణా వాహనం, మూడు సెల్ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో రాయినేని శంకర్, గౌరుకొత్తపల్లి, రేగొండ మండలం, భూపాలపల్లి జిల్లా, ముసిక లక్ష్మణ్ , నీరుకుళ్ల గ్రామం, ఆత్మకూర్ మండలం, వరంగల్ జిల్లా, మాట మహేష్ లు.. బండారుపల్లి గ్రామం,ములుగు జిల్లా, గండికోట సతీష్, పస్రా, ములుగు జిల్లాకు చెందిన వారని తెలిపారు. నిందితులను పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన పర్కాల ఏసిపి శివరామయ్య, టాస్కోర్స్ ఇన్స్పెక్టర్లు కె. శ్రీనివాసరావు,



వెంకటేశ్వర్లు, ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ బి. కుమార్, టాస్కోర్స్ ఎస్.ఐ. లు లవణ కుమార్, నిసార్పాషా, హెడ్ కానిస్టేబుల్ స్వర్ణలత, కానిస్టేబుళ్ళు శ్యామ్, రాజు, బిక్షపతి, సురేష్, శ్రవణ్ నవీన్, కరుణాకర్లను ఈస్ట్ జోన్ డిసిపి అభినందించారు.

## సురారంలో ప్రజా గోస-బిజెపి

# భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం లోని సూరారం గ్రామంలో బిజెపి ప్రజాగోష భరోసా మీటింగ్లో ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యాపేట జిల్లా ఇంచార్జి, హుస్నాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎంఎల్ఏ చాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల ఈ కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు, గ్రామలల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయి అని వివరించారు, ప్రతి కార్యకర్తకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి మాట్లాడుతూ.... ఇంటింటికి నల్ల నీళ్లు ఇస్తామని చెప్పి ఇయ్యలేని ఈ కేసీఆర్ సర్కారు గ్రామలల్లో 50 మంది కొక్క బెల్టుషాపులను మాత్రం ఏర్పాటు చేసింది అని ప్రభుతకాన్ని విమర్శించారు. సురారం గ్రామ శక్తి కేంద్ర ఇంచార్జి సింగణవేన రాజు, బూత్ అధ్యక్షులు పల్లెపాటి మధుకర్, భాస్కర్, శివ, బిట్ల లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ మీటింగులో మండల పార్టీ అధ్యక్షులు కుడుతాడి చిరంజీవి, నియోజకవర్గ కో కన్వీనర్ వేణుగోపాల్ రావు,



నాయకులు అదేపు శ్రీవర్ధన్, కంచర్ల శంకరయ్య, ముస్కె వెంకటేష్, జనగాని కిష్టయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిదురాల వెంకటేష్, ఎర్రోళ్ల రాజు, డాక్టర్ మధుకర్, రమణాచారి, పెరుగు మధు, వెంకట్, శ్రవణ్, పుట్ట కనకయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

## 24న సాయి విజ్ఞాన కాలేజీ వార్షికోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ పద్మారావునగర్ లోని శ్రీసాయి విజ్ఞాన భారతి జూనియర్, డిగ్రీ మహిళా కాలేజీ 31వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 24న హరిహర కళా భవన్ లో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. రమాదేవి, ఛైర్మన్ వై. విజయలక్ష్మీ తెలిపారు. ఇటీవల నిర్వహించిన మ్యాథమెటిక్స్ మోడల్ పరీక్ష విజేతలకు ఈసందర్భంగా నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందచేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్ట్ ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ మాజీ ఛీఫ్ సెక్రటరీ ఎల్వీ. సుబ్ర హ్మణ్యం, ప్రత్యేక అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్ మెంట్ హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఫౌండర్, ఛైర్మన్ నోముల ప్రకాశ్ హాజరవుతారని పేర్కొన్నారు.

## ఆలయాలలో ధూప, దీప, నైవేద్య తనిఖీ

**పరకాల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** దేవాదాయ ధర్మాదాయ శాఖ ధూప, దీప నివేదనకు దరఖాస్తు చేసుకున్న ఆలయాలలో పరిశీలన నిమిత్తం సందర్శించి, దేవాదాయ ధర్మాదాయ శాఖకు వివరాలు సమర్పించినట్లు పరిశీలకులు గూడూరు



సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం పరకాల మండలం లక్ష్మీపురం ఆంజనేయస్వామి దేవాలయంను హనుమకొండ జిల్లా కమిషనర్ ఆదేశానుసారముతో డివిజనల్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి, సెలెక్ట్ కమిటీ సభ్యులు కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు నేరుగా దేవాలయానికి వెళ్లి తనిఖీ చేశారు.

## దట్నూరులో కంటి వెలుగు కార్యక్రమం

**గొల్లపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలలో భాగంగా కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని దట్నూరు గ్రామంలో ప్రారంభించారు. కంటి



వెలుగు కార్యక్రమానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి యొక్క కంటి సమస్యలకు సంబంధించి డాక్టర్లు చెప్పిన విధంగా తగు నిర్ధారణ చర్యలను తీసుకోవడం అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు కూడా ఇవ్వడం ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల పావని నగేష్, ఎంపీపీ నక్క శంకరయ్య, జెడ్పిటిసి గోస్కుల జలంధర్, ఏఎంసి చైర్మన్ కాంపెల్లి హాస్మండ్లు, చందోలి పిఏసిస్ చైర్మన్ గండె వెంకట మాధవరావు, ఎంపీటీసీ చింతం అశోక్, ఉప సర్పంచ్ మీసాల పోషవ్వ వినోద్, ఎంపీడీవో నవీన్ కుమార్, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి నరేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య ప్రధాయినీ తులసి మొక్క

**పర్యావరణహితమైన శుభలేఖ**

**చిగురించే శుభలేఖ ను కలెక్టర్ శివలింగయ్య కు అందజేత**

**జనగామ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మంచాల శంకరయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నిజామాబాద్ వ్యాస్తవ్యులు మంచాల జ్ఞానేందర్ తన కూతురు డాక్టర్ శరణ్య వివాహం సందర్భంగా తులసి గింజలను పొదిగిన



పర్యావరణహితమైన ఆహ్వాన పత్రికను అచ్చు వేయించారు. ఈ కార్డును చిన్న ముక్కలుగా చేసి కుండిలో వేసి నీరు పోసినట్లైతే వారం రోజుల్లో ఆరోగ్య ప్రధాయినీ అయిన తులసి మొక్కలు పెరుగుతాయి. జ్ఞానేందర్ కోరిక మేరకు కాసాల సంతోష్ కుమార్, బొగ్గారపు శ్రీనివాసు లు జనగామ జిల్లా కలెక్టర్ సి. హెచ్. శివలింగయ్య కి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి మనకు ఎంతో ఇస్తుంది అలాంటి ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత అనే మంచి ఆలోచనతో వివాహ ఆహ్వాన పత్రికను తయారు చేయించిన జ్ఞానేందర్ అభినందనలు తెలిపారు.

## నూతన తహశీల్దార్ను

## కలిసిన ప్రెస్ క్లబ్ సభ్యులు

**రాయికల్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** రాయికల్ మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ అబ్దుల్ ఖయ్యాం ను మంగళవారం రాయికల్ ప్రెస్ క్లబ్ (రి) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.... రెవెన్యూ సమస్యల



పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పాత్రికేయులు సమాజంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు కనికరపు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎద్దండి జితేందర్, సహాయ కార్యదర్శి ఒరుగంటి భీమరాజ్, కోశాధికారి కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు వాసం లింబాద్రి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# అనాధ వికాస పిల్లల భరోసా

**హుస్నాబాద్ 21 ఫిబ్రవరి (ప్రజామంటలు):** హుస్నాబాద్ మండల కేంద్రంలో ఆర్య వైశ్య ఫంక్షన్ హాల్ లో బాల వికాస ఆధ్వర్యంలో అనాధ వికాస పిల్లల పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. వికాస పిల్లలకు భరోసాగా బాలక్క ఉంటుందని వారి విద్యను అభ్యసించడానికి సెల్ ఫోన్ ట్యాబ్ లు



అందించి బరోసా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వికాస పిల్లులు మాట్లాడుతూ.... మాకు మా తల్లిదండ్రులు లేకున్నా మాకు ఎంతో భరోసని ఇచ్చి మా జీవితంలో వెలుగులు నింపిన బాలక్కకు కృతజ్ఞతలు తెలియ చేశారు అలాగే వికాస పిల్లల కోసం గ్రామాలలోని మహిళలు వందల సంఖ్యలో వచ్చి వారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకట్ వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి బాలవికాస ప్రోగ్రాం డైరెక్టర్ లత బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి వాటర్ ఫెడరేషన్ డైరెక్టర్స్ ఐలేని మల్లి కార్జున్ రెడ్డి వరియోగుల శ్రీనివాస్ బంక చందు వెన్నరాజు హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ డోనర్ రమ దేవి బాలవికాస కోఆర్డినేటర్స్ జ్యోతి నిర్మల మహిళా సంఘాల అధ్యక్షులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వితంతు పెన్షన్ కోసం
# దరఖాస్తు చేసుకోవాలి

**ఎంపీపీ జజాల భీమేశ్వరి**

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వయస్సు ఎక్కువ ఉన్న పెన్షన్ దారులు మరణించిన వారి భార్యలకు ఆసరా పెన్షన్ కింద 23 మంది లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతినెల పెన్షన్ 2000 రూ.లు వచ్చుటకు గౌరవ సంక్షేమ శాఖ మాత్యులు కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు మంజూరు అయినవి. ఇంకా ఎవరైనా



వితంతు పెన్షన్ కు అర్హులైన వారు ఉంటే మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఇబ్రహీంపట్నంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి విలేకరుల సమావేశంలో తెలిపారు.

## మల్లారం గ్రామంలో
# ఉచిత పశు వైద్యశిబిరం

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు) :** మండలంలోని మల్లారం గ్రామంలో ఉచిత పశు వైద్య, పశుసంతానోత్పత్తి శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గూడెల్లి రాజిరెడ్డి ప్రారంభించారు. మండల పశు వైద్య అధికారి డాక్టర్ మాలతి





రెడ్డి వివిధ వ్యాధులతో బాధ పడుతున్న పశువులను పరీక్షించి చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డా. మాలతిరెడ్డి మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త తోనే వ్యాధి నివారణ సాధ్యమని అన్నారు. అనంతరం కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు పశువులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# కంటి, డయాబెటిక్ వైద్య శిబిరం

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** హైదరాబాద్ మల్కాజిగిరి ఒలిపిక్స్ లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో తార్నాక క్లినిక్ లో ఉచిత కంటి, డయాబెటిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది హెల్త్ క్యాంపును సందర్శించి కంటి పరీక్షలను, డయాబెటిక్ పరీక్షలను




చేయించుకున్నట్లు లయన్ కె.హనుమంతరావు తెలిపారు. అవసరమైన వారికి మందులను కూడ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. లయన్ దిలీప్ కుమార్, చీఫ్ గెస్ట్ లయన్ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణ ప్రసాద్, రిటైర్డ్ ఏసీపీ గాంధీ నారాయణ, లయన్స్ హాస్పిటల్ ఎం. ఎస్ రెడ్డి, శ్రీహరి, సుజాత, కె. ఎస్. అశోక్ కుమార్, కె. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల పెళ్లల మేనమామ కట్నంగా
# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం

- పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా సిఎంఆర్ఎఫ్

**చిగురుమామిడి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండల పరిధిలోని 22 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం కింద 22 లక్షల 2 వేల 552 రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం 11 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా 3 లక్షల 41 వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని ఎమ్మెల్యే సతీష్ కుమార్ స్పష్టం చేశారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని అన్నారు. ఆసరా ఫింఛన్ , రైతుల కోసం రైతు బంధు. రైతు భీమా, 24 గంటలు ఉచిత కరెంట్ , పేదల కోసం షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఆలోచించలేదు. ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా ఉండేది . కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఆడపడుచులకు అండగా ఉంటు వారి పిల్లల పెళ్లిళ్లకు లక్ష నూట పదహారు రూపాయలు అందించి వారి కుటుంబంలో ఒకరిగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనమామ కట్నంగా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని, పేద మధ్య తరగతి కుటుంబాలకు పెళ్లి ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఒక లక్ష నూట పదహారు రూపాయలు ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు భారం కావొద్దనే సీఎం కేసీఆర్ ఈ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పేద ప్రజలు అనారోగ్యంనికి గురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మందికి ఉపయోగ పడుతుందని ఎమ్మెల్యే సతీష్ కుమార్ పేర్కొన్నారు.సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి జెడ్పిటిసి గీకురు రవీందర్ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, తాహసిల్దార్





సయ్యద్ ముబీన్ అహ్మద్, ఎంపీడీవో నరసయ్య, వైస్ ఎంపీపీ బేతి రాజ్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కర్వేద మహేందర్ రెడ్డి, రైతుబంధు జిల్లా నాయకులు సాంబార్ కొమురయ్య, మండల కన్వీనర్ పెనుకుల తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి బి.సి ముఖ్యనాయకుల సమావేశం

**రాయికల్ ఫిబ్రవరి 21(ప్రజామంటలు):** పట్టణ కేంద్రంలో మండల స్థాయి బి.సి ముఖ్యనాయకుల సమావేశం వి ఎస్ గార్డెన్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ మాట్లాడుతు చట్టసభ లలో బి.సి. లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దేశ జనాభాలో 78 కోట్లకు పైగా అత్యధిక జనాభా కలిగిన అందులో 74% కలిగిన బి.సి లకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడి, నెట్టి వేయబడి అన్యాయమని పార్లమెంటులో బి.సి బిల్లు ప్రవేశపెట్టి బి.సి లకు 50% రిజర్వేషన్లు కేంద్రంపై పాలకులు ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 42 లక్షల కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్లో బి.సి ల సంక్షేమానికి కేవలం 2000 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర మంత్రివర్గంలో, రాష్ట్ర మంత్రివర్గంలో లోక్ సభ, రాజ్యసభ, రాష్ట్ర అసెంబ్లీ కౌన్సిల్ లో 75 సంవత్సరాల నుండి బి.సి ల ప్రాతినిధ్యం 14% దాటలేదు. బి.సి లకు ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంత అన్యాయం జరిగిందో, జరుగుతుందో తెలుస్తుంది. బి.సి లకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉన్నప్పుడు . కావున జనాభ ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలనీ . మరియు కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీపతి రమేష్, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బి.సి. సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దీటి వెంకటేష్, బీసీ సంఘం జిల్లా జిల్లా నాయకులు గంగాధరి సురేష్,ఆసరి మల్లేష్ యాదవ్,బత్తిని నాగరాజు, బి.సి. సంక్షేమ సంఘం రాయికల్ మండల అధ్యక్షుడు బండారి సాయిరాజ్ గౌడ్, రాయికల్ పట్టణ అధ్యక్షుడు సామల్ల సతీష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిరుపుల్ల మల్లేష్,డివిజన్ అధ్యక్షుడు మాచర్ల మారుతీ,రాయికల్ మండల యువజన సంఘ అధ్యక్షులు మొత్కూరి శ్రీనివాస్ గౌడ్,మండల



ప్రధాన కార్యదర్శులు ఆవుల రాజశేఖర్,గాజంగి విష్ణు నాగుల రమేష్ నాగుల మధు బలుసు రంజిత్, ఏనగందుల ఆనంద్, ఆడపు సురేష్, వేణు సంకోజి శేఖర్, ప్రశాంత్, కట్కాం సాయి, సింగని నరేష్, శ్రీగద్దె సుమన్, ఆకుల శేఖర్ పసుపునూరు రాజేష్, తాటిపాముల శేఖర్ ప్రవీణ్, లక్ష్మినారాయణ, బీమలింగం, బీసీ సంఘ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహంపై నిర్లక్ష్యం వీడాలి

- సుందరీకరణ పనులను వెంటనే చేపట్టాలని దళిత సంఘాల డిమాండ్

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):** అంబేద్కర్ జయంతి సాక్షిగా ఇచ్చిన హామీని మంత్రి ఇతర నేతలు విస్మరించారని, అంబేద్కర్ విగ్రహ సుందరికరణ పనులను చేపట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జగిత్యాల పట్టణంలోని ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలను సుందరీకరణ చేపట్టారన్నారు. గత అంబేద్కర్ జయంతి సాక్షిగా మంత్రి తోపాటు మరికొందరు నేతలు అంబేద్కర్ విగ్రహాన్ని సుందరికరణ చేపడతామని హామీ ఇచ్చి విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తహసిల్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న సిగ్నల్ లైట్లు తొలగించాలని లేని పక్షంలో వెయ్యి మందితో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్,మహాజన సోషలిస్టు పార్టీ కో కన్వీనర్ బెజ్జంకి సతీష్, ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా కన్వీనర్ సురుగు శ్రీను (జగన్), మహాజన సోషలిస్టు పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జి బోనగిరి కిషన్, మాల మహానాడు మండల కార్యదర్శి పుట్ట గంగాధర్, రెగుంట గంగాధర్, జనసేన పార్టీ జగిత్యాల



నియోజకవర్గ కో ఆర్డీనేటర్ బెక్కం జనార్దన్, బొల్లి రామ్, దుమాల పెద్ద గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# మొగిలిపేటలో ప్రజా గోస బీజేపీ భరోసా

**మల్లాపూర్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్య అతిథిగ మండల ఇంఛార్జి సంబారి ప్రభాకర్ మండల అధ్యక్షులు ముద్దం సత్యనారాయణ శక్తి కేంద్ర ఇంఛార్జి రాజేందర్, బూత్ అధ్యక్షులు గోల్కొండ ప్రవీణ్ కుమార్, బంటు మారుతి, కనుగంటి గంగారెడ్డి, మిట్టపెల్లి లక్ష్మణ్, బుర్రి భీమన్న, కోట లక్ష్మి, చెల్లపెల్లి రాజగంగు, ఎదులపురం నరేష్ మరియు బిజెపి నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, రైతు వ్యతిరేక విధానాలను, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించడం జరిగింది.



# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష

**వంగర ఎస్సై మౌనిక రెడ్డి**

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మండలంలోని వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో ధర్మసాగర్ మండలానికి చెందిన ఎండి అసిఫ్ అలీ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పట్టుపడగా వంగర పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పట్లో అరెస్టు చేశారు. 2023 ఫిబ్రవరి 20 న, హనుమకొండ ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ట్ సెషన్స్ జడ్జ్ టి. జయలక్ష్మి నేరస్తుడికి 1 సం. 6 నెలలు కఠిన కారాగార శిక్ష 10,000/బి రూ.లు జరిమానా విధించినట్లు వంగర ఎస్సై మౌనిక రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మౌనిక రెడ్డి మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కెరీర్ పై దృష్టి పెట్టాలని అన్నారు.



## తెలుగు సాహితీమూర్తుల
# చిత్రపటాలతో ప్రదర్శన, ర్యాలి

**హుజురాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ భాష దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో తెలుగు సాహిత్యంలో పేరుగాంచిన 200మంది



సాహితీమూర్తుల చిత్రపటాలను విద్యార్థుల చే ప్రదర్శించారు. విశిష్ట అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి కే. వెంకట నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ మాతృభాష, మాతృమూర్తి మర్చిపోలేనివని, మాతృభాషలో మాధుర్యాన్ని తెలుసుకొని అందరూ మాతృభాషను ఆదరించాలని తెలియజేశారు. తెలుగు భాషోపాధ్యాయులు సంపత్ మాట్లాడదుతూ తేనెవంటి తెలుగు భాషలో మాట్లాడటం గర్వకారణంగా భావించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పాటలు, పద్యాలు, మాతృభాష పై వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనురాధ, తెలుగు భాష ఉపాధ్యాయులు సంపత్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సిఆర్పి లు పాల్గొన్నారు.

## రవీంద్ర ప్లే స్కూల్లో అంతర్జాతీయ
# మాతృభాష దినోత్సవ వేడుకలు

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని రవీంద్ర ప్లే స్కూల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని



విద్యార్థులు మన పుట్టుకకు మూలమైన అమ్మను గుర్తు చేస్తూ 'అమ్మ' ఆకృతిలో కూర్చుని తెలుగు భాషా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు, డైరెక్టర్స్ బి శ్రీధర్ రావు, బి. హరిచరణ్ రావు, కే. కిషన్, జే. మౌనిక, లతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ డిప్యూటి చైర్మన్
# బండ ప్రకాశ్‌కు సత్కారం

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఇటీవల తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటి చైర్మన్ గా ఎంపికైన బండ ప్రకాశ్ ను మంగళవారం లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



భవిష్యత్ లో బండ ప్రకాశ్ మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రొట్టం భూపతి, లయన్ కొడిమెట్ హనుమంతరావు, సత్యనారాయణ, డా. జ్ఞానేశ్వర్, వినోద, రాజు, డా. కృష్ణ, లయన్ అశోక్ రాందాస్, లయన్ కె. రాఘవేంద్రరావు, బల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధ్రువపత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు

**ఎంవిఐ సీరాజ్ ఉర్ రహమాన్**

**హుజురాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ధ్రువపత్రాలు లేకుండా రహదారిపై వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని



హుజురాబాద్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎండి సిరాజ్ ఉ ర్ రెహమాన్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణ శివారులో ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఆయన జమ్మికుంట రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధృవపత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

**ఆర్టీసీ ని పరిరక్షించుదాం:**

ప్రజాసేవ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీని పరిరక్షించుదామని హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.అర్పిత అన్నారు. మంగళవారం ఆమె జమ్మికుంట రోడ్ లో ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను ఆపి ఆర్టీసీ బస్సులో ఎక్కించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక సంఖ్య లో ప్రయాణికులతో ఆటోలలో ప్రయాణించడం ప్రమాదకరమని చట్టరీత్యా నేరం కూడా అని అన్నారు. పరిమితికి మించి వాహనాలలో ప్రజలను తీసుకుపోకూడదని ఆటో డ్రైవర్లకు, ప్రైవేటు వాహనదారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్ఆర్ రెడ్డి, ఎల్వో జాఫర్, సిఆర్ సి స్వామి, కానిస్టేబుళ్లు కత్తుల నాగరాజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతి, తీరని లోటు

**అంత్యక్రియలు అధికారికంగా జరపకపోవడం అన్యాయం**

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అకాల మరణం పేద ప్రజలకు తీరని లోటని ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ముదిరాజ్ ల ఆరాధ్యదైవం కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, ఆయన విగ్రహం ఏర్పాటుకు సాయన్న ఎంతో సహాయం చేశారని గుర్తు చేశారు. ఏకంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్న అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం ఘోరమన్నారు.



దళిత ఎమ్మెల్యేపై ఇంతచిన్నచూపు చూడటం అగ్రవర్ణాల కుట్ర అని విమర్శించారు. సాక్షాత్తూ ఒక దళిత ఎమ్మెల్యేకు కనీసం గౌరవం ఇవ్వని ప్రభుత్వ పెద్దలు ఇక సామాన్య ప్రజలను ఏం పట్టించుకుంటారన్నారు.

# వేల్స్ గ్రూప్ అఫ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సెమినార్

**హన్మకొండ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** కాకతీయ విశ్వవిద్యాలయం ను ప్రతిష్టాత్మక బ్రిటిష్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు సందర్శించారు. వేల్స్ గ్రూప్ అఫ్ యూనివర్సిటీ లు అయిన అబిర్స్విత్ యూనివర్సిటీ మరియు బంగొర్ యూనివర్సిటీ ప్రతినిధులు విశ్వవిద్యాలయ అధికారులతో బయో టెక్నాలజీ విభాగం లో సమావేశమయ్యారు. వీ సీ ఆచార్య తాటికొండ రమేష్.. వివిధ విభాగాల ప్రతినిదుల తో అకాడమిక్ అంశాలలో భాగంగా డిగ్రీ ప్రోగ్రాం లపై



వివిధ పరిశోధన ల పై విస్తృతం గా చర్చించారు. అనంతరం అబిర్స్విత్ యూనివర్సిటీ పక్షాన అ విశ్వవిద్యాలయ ప్రో. వైస్ ఛాన్సలర్ ఆచార్య టీం వుడ్స్, బెవ్ హెర్రింగ్ బంగొర్ యూనివర్సిటీ పక్షాన ప్రో. వైస్ ఛాన్సలర్ ఆచార్య నికోలా క్యాలావ్, డాక్టర్ ఏమో ఈయో అధ్యాపకులు అడిగిన సందేహాలు నివృతి చేసారు. అతిథులను శాలువా, జ్ఞాపిక, బోకే తో సన్మానించారు.

# కొత్తకొండ సబ్ స్టేషన్ పరిధిలో సక్రమ విద్యుత్ వినియోగం

**ఏఈ శిరీష్ కుమార్**

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మండలంలోని కొత్తకొండ సబ్ స్టేషన్ పరిధిలోని గృహ సంబంధిత కనెక్షన్లన్నింటికీ మీటర్ ద్వారానే వినియోగం




జరుగుతుందని ఏఈ శిరీష్ కుమార్ తెలిపారు. అలాగే వ్యవసాయ బావులన్నింటికీ విద్యుత్ కలెక్షన్ ఉందని అన్నారు. అనంతరం ఏడిఈ రాజు మాట్లాడుతూ కొత్తకొండ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఎక్కడ కూడా అనధికార విద్యుత్ కలెక్షన్లు లేవని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తకొండ సెక్షన్ సిబ్బందిని డిఈ సామ్య నాయక్ అభినందించారు

# స్వగ్రామానికి చేరిన గల్ఫ్ లో జీతం రాక మానసిక ఒత్తడితో మరణించిన గణేష్ మృతాదేహం

**మల్లాపూర్ ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):** కొత్త దాంరాజ్ పల్లికి చెందిన సుంకె గణేష్ ఈ నెల 16 న కువైట్ లోని అదాన్ ఆసుపత్రిలో మరణించాడని, అతనికి ఇస్తామన్నజీతంలో సగం జీతమే ఇవ్వడం, ఓవర్ టైం లేకపోవడం, ఉద్యోగానికి చేసిన ఖర్చు ఎక్కువగా ఉండడంతోపాటు, అక్కడి రెసిడెన్సీ స్టాంప్ పడకపోవడంతో మానసిక ఒత్తడికి గురై ఆశపాత్రిలో చేరి, అక్కడే మరణించినట్లు ఆతని భార్య రాజేశ్వరి తెలిపింది. సుంకె గణేష్ మరణంతో తన మీద ఆధార పడి ఉన్న కుటుంబ సభ్యులు 32 ఏండ్ల భార్య రాజేశ్వరి, 4 ఏండ్ల కుమారుడు రెహాన్,49 ఏండ్ల సోదరి రాధ, 3 ఏండ్ల కూతురు రియాశ్రీ, 70 ఏండ్ల తండ్రి పెద్ద గంగారాం,65 ఏండ్ల తల్లి గంగు అనాథలయ్యారని, ప్రయాభుత్వం తమ కుటుంభయాన్ని ఆదుకోవాలని ఆమె కోరారు. గణేష్ ఉద్యోగానికి వెళ్ళినప్పుడు ఏజెంట్లు ఏ మైగ్రేట్ సిస్టమ్ ఫాలో కాలేదని, ఇతనికి ప్రవాసీ భారతీయ భీమా కూడా ఇప్పించలేకపోవడంతో ఇతనికి ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా అందలేదని తెలుస్తున్నది. గ్రామస్తుల ద్వారా ఆదాయం లోని స్థానిక నాయకుడు నిశాంత్ కార్తికేయకు తెలుపగా తాను గల్ఫ్ జె ఏ సి వైస్ చైర్మన్ గంగుల మురళీధర్ రెడ్డికి సహకారంతో మృతదేహం స్వదేశం రావడానికి కృషి చేసారు.మరియు తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఉచిత అంబులెన్స్ సహకారం తీసుకున్నారు. కువైట్ లో బొప్పారపు శంకర్ ఇండియాలో లో



పాలేపు కపిల్, బాబురావు బృందం మురళీధర్ రెడ్డి కి సహకరించారు. అంత్యక్రియల్లో పాల్గొన్న గల్ఫ్ జెఏసి చైర్మన్ గుగ్గిల రవి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, తెలంగాణ ప్రభుత్వంవెంటనే 500 కోట్ల రూపాయలతో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలనీ , గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5.లక్షల రూపాయల ఎక్స్రిసియా అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం"

**మెటుపల్లి ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోజున అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మాతృ భాష ఆవశ్యకతను



గురించి విద్యార్థులు ఉపన్యసించారు. సమాజంలో మాతృ భాషకు ఎనలేని ప్రాధాన్యత ఉందని,అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న అంశాలను తెలుసుకోటానికి మాతృ భాష ఎంతో ఉపయోగపడుతుందని కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రసంగించారు.సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ మరియు తెలుగు విభాగం అధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ,అంతర్జాతీయ మాతృ భాష ప్రాధాన్యత గురించి మరియు భాష పట్ల విద్యార్థులకు అవగాహన, స్పష్టత ఉండాలని, అప్పుడే ప్రతీ ఒక్క విద్యార్థికి మాతృ భాష పట్ల ఆసక్తి పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో గుర్తింపు పొందటానికి మాతృ భాష ఆవశ్యకత ఎంతో ఉంటుందని,అందుకోసం విద్యార్థులు నిరంతర ప్రయత్నం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు బిల్ల రాజేందర్,ఏ. మనోజ్ కుమార్,మధుబాబు, వెంకయ్య, గట్టయ్య, అంజయ్య లతో పాటు బోధనేతర సిబ్బంది అన్వేష్, బాబు, లక్ష్మీనారాయణ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల విందుగా రథోత్సవం

**రాయికల్, ఫిబ్రవరి 21 ( ప్రజామంటలు):** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని అంగడి రాజరాజేశ్వర ఆలయ రథోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు. డబ్బులు చప్పుళ్ల మధ్య భక్తుల శివ నామస్మరణ చేస్తూ రథాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు



శివనామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. ఉదయం నుంచి భక్తులు దర్శించుకుంటున్నారు ఈ సందర్భంగా ఆలయ పూజారిఅంగడి భువనేశ్వర్ మాట్లాడుతూ అర్ధనారీశ్వరుడు శివుని పూజించడం వల్ల గ్రామస్తులందరికీ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు, పసిడి పంటలు బాగా పండుతాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీపీలావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్, జడ్పిటిసి జాదవ్ అశ్విని, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, ఎంపిటిసి మోర విజయలక్ష్మి వెంకటేష్, ఫాక్స్ చైర్మన్ రాజలింగం, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, బిజెపి నియోజకవర్గ నాయకులు ఎద్మల శైలేందర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ రమణాయ్య పుస్తకాలను జిల్లా కలెక్టర్ కు అందజేత

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**స్థానిక చరిత్రకారుడు, రీడర్, డాక్టర్ జె.రమ ణాయ్య రచించిన జిల్లా చరిత్ర, ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి షేక్



యస్మిన భాషకు సమాజా సేవకులు, జగిత్యాల గాంధీ డా. రాజగోపాల చారి అందించారు. లోక అదలత్ బెంచ్ మెంబర్ సమాజానికి ఎన్నో సేవలందిస్తున్న డాక్టర్ రాజగోపాల్ చారి ని జిల్లా కలెక్టర్ షేక్ యస్మిన్ భాష శాలువాతో సన్మానించారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

**- శికారి గోపి కృష్ణ**

**కోరుట్ల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో జనాభా పరంగా సగానికి పైగా ఉన్నబీసీలకు తీరని అన్యాయం చేశారంటూ తెలంగాణ బీసి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపి కృష్ణ అసహనం వ్యక్తం చేశారు.బీసీ యువజన సంఘం సమావేశంలో మాట్లాడుతూ, జనాభా లో 54,శాతం పై బడి ఉన్న బిసిలపై రాష్ట్ర ప్రభుత్వం



సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని బిసిల బడ్జెట్ ను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి బిసి విద్యార్థికి ఉన్నత విద్యాభ్యాసం కోసం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి ఫీజులను భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్, బిసి యువజన సంఘం నాయకులు మిట్టపెల్లి రమణ, బిజ్జారపు ప్రవీణ్ కుమార్, జంగిలి విజయ్ , పోతుగంటి మారుతి , అల్లే జగదీశ్వర్, పోతని నితిన్, పొట్టాల మురళి, పిటేరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అందుల సంక్షేమానికి ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థుల విరాళం రూ.3,21,500

**జనగామ ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శెరిగూడ కేంద్రంగా అందుల అనాధల కేంద్రం ఇట్రాడ్ సంస్థకు జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సేకరించిన రూ.3 లక్షల 22 వేల 500 రూపాయలు చెక్కును మంగళవారం వితరణ చేశారు. ఇటీవల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో అంధ కళాకారులు వివిధ సామాజిక అంశాలపై పాటలు పాడి విద్యార్థులను ఆకర్షించారు. మంగళవారం ఏర్పాటు చేసిన వితరణ కార్యక్రమానికి అధ్యక్షులు వహించిన ఏకశిల విద్యాసంస్థల కార్యదర్శి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.... అందుల అనాథల సేవలో 25 సంవత్సరాలు




పూర్తి చేసుకున్న ఇట్రాడ్ సంస్థ నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, పద్మా రెడ్డిలను అభినందించారు. అందుల కార్యక్రమం తిలకించిన విద్యార్థులు చిన్నచిన్న మొత్తాలను సేకరించి వితరణ చేయడం జరిగిందని, ఈ సేవా కార్యక్రమం పట్ల విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ ఇంటర్నేషనల్ 320%ట% జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ చిన్నతనంలో విద్యార్థులలో సేవా బీజాని నాటడం అభినందనీయమని ఏకశిల విద్యా సంస్థ నిర్వాహకులు ఉపాధ్యాయులను అభినందించారు. గతంలో కూడా కార్గిల్ వార్,కేరళ వరద బాధితుల సహాయార్థం కూడా ఆర్థిక సాయం చేసి చేసిన సంఘటన గుర్తు చేస్తూ అవసరార్థులను ఆదుకొనడంలో ఏ సమయంలోనే స్పందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా వందన సమర్పణ చేస్తూ ఈ సేవ యజ్ఞంలో భాగస్వామ్యం విద్యార్థుల అభినందించారు.

# చేపల చెరువు పనులను పరిశీలించిన డిఆర్డిఓ పిడి ఏ. శ్రీనివాస్ కుమార్

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** మండలంలోని గాంధీనగర్, మాణిక్యాపూర్ లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చేపల చెరువు పనులను మంగళవారం డిఆర్డిఓ పిడి ఏ. శ్రీనివాస్ కుమార్ పరిశీలిం చారు. ఎంపీ డీవో లంకపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మం డలంలో జరుగు తున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు ఉపాధిహామీ పథకం, మన ఊరు మనబడి పనులపై సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు, ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించి ఉపాధి



హామీ పనులను విస్తృతంగా ఉపయోగించు కోవాలని కోరారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచులు తులశమ్మ రాజయ్య, రవీందర్, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గౌడ కులస్తులకు న్యాయం చేయాలి

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామ గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఈత చెట్లు నాటి వాటిని పెంచుకోవడానికి



స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేయగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా సమీకృత కలెక్టరేట్ లో గౌడ సంఘ సభ్యులతో కలిసి కలెక్టర్ కు సమస్యను వివరించి వారికి ప్రభుత్వం స్థలం మంజూరుకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరిన డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ గౌడ్, నాయకులు అంకం సతీష్, గిద్దె రాజు, దనేశ్వరా రావు, గౌడ సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

# అంబారీపేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.సంజయ్.

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** జగిత్యాల అర్బన్ మండల అంబారీపెట్ గ్రామంలో 15 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి,మండల పరిషత్ నిధులు 10 లక్షలతో స్కూల్ లో అదనపు తరగతులు, కళ్యాణ మండపంలో టాయిలెట్ ల నిర్మాణం కోసం అభివృద్ధి పనులకు భూమి



పూజ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబారీ పెట్ గ్రామానికి చెందిన ముగ్గురు ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 3 లక్షల రూపాయల విలువగల చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ములాసపు లక్ష్మి, జడ్పిటిసి మహేష్, సర్పంచ్ గోడిసెల గంగాధర్, ఎంపీటీసీ దమ్మ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ నారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు ఆది మల్లేశం, వెంకటేశ్వర ఆలయ చైర్మన్ బక్కన్న, వైస్ చైర్మన్ గంగాధర్, నాయకులు శంకరయ్య, వెంకటేశం, నారాయణ, రాజు, గంగారెడ్డి , వెంకన్న, యూత్ అధ్యక్షులు శేఖర్, ఏఈ రాజమల్లయ్య, ఎంపిడిఓ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్ పూర్ పురుషుల పరపతి సంఘం

**అధ్యక్షునిగా శ్యాం సుందర్ ఎన్నిక**

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో పురుషుల పొదుపు సంఘం అధ్యక్షులుగా బందెల శ్యాంసుందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జూపాక మధుకర్ నిమ్మల మనోహర్ ప్రభాకర్ కార్యవర్గ సభ్యులుగా తాటికొండ అభిలాష్ కర్రే రవీందర్ గడ్డం చిరంజీవి తాళ్ల తిరుపతి మామిళ్ళ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో జూనియర్, డిగ్రీ కాలేజిలను ఏర్పాటు చేయాలి

**-బీజేపీ నాయకురాలు తుల ఉమ**

**జగిత్యాల ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):**పూర్తి గ్రామీణ మండలాలైన మేడిపల్లి,కథలాపూర్ లలో ఉన్నత విద్యావకాశాలు లేక పేద,



దళిత,వెనుకబఫైన తరగతుల పిల్లలు విద్యకు దూరమౌతున్నారని, పేద విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలోపెట్టుకొని, ఈ మండలంలో జూనియర్,డిగ్రీ కాలెజి ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జెడ్పి అధ్యక్షురాలు తుల ఉమ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు. మండలాలలోని ఇతర సమస్యల పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ మండలాల్లో వరదకాలువ, సారమ్మ చెరువు సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతాంగానికి ఊరట కలిగించాలని ఆమె జిల్లా కలెక్టర్ ను కోరారు.

# జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేతగా మహాదేవపూర్ హై స్కూల్ విద్యార్థి

**మహాదేవపూర్ ఫిబ్రవరి 21 (ప్రజా మంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కాళేశ్వరం మహాదేవపూర్ శాఖ అధ్యక్షులు ఆరుట్ల భాస్కరాచారి సహకారంతో సీవీ రామన్ జయంతి, జాతీయ వైజ్ఞానిక దినోత్సవ సంబరాలు, లో భాగంగా జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్రం ప్రతిభా పరీక్ష




పోటీలు నిర్వహించారు. మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ హై స్కూల్(బాలుర)లో 9వ తరగతి చదువుతున్న ఆరెందల విజ్ఞేష్ మొదటి బహుమతి పొందినట్లు లయన్స్ క్లబ్ మహాదేవపూర్ శాఖ కార్యదర్శి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మడక మధు తెలిపారు సైన్స్ టాలెంట్ టెస్ట్ లో తమ పాఠశాలకు ప్రథమ బహుమతి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ అభినందించారు జిల్లాస్థాయి లో రాణించిన హై స్కూల్ విద్యార్థి విజ్ఞేష్. ను సర్పంచ్ శ్రీపతి బాపు ప్రత్యేకంగా అభినందించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com